Follow: @ANNTELUGU
18-05-2026

# మహా పత్రిక

ANN తెలుగు

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 141 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## అమరావతి వేదికగా డిజిటల్ విప్లవం

### దేశంలోనే తొలి క్వాంటం టెస్ట్ బెడ్

అమరావతి టెక్ ప్రగతిపై సీఎం చంద్రబాబు కీలక ప్రకటన

**అమరావతి, మహా:** సాంకేతిక రంగంలో ఎప్పుడూ ముందుచూపుతో వ్యవహరించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరో చారిత్రక ఘట్టానికి వేదికైంది. భవిష్యత్తు ప్రపంచాన్ని శాసించనున్న డిజిటల్, సైబర్ భద్రత రంగాల్లో దేశానికి దిశానిర్దేశం చేసేలా అమరావతి సరికొత్త రూపుదిద్దుకుంటోంది. ప్రపంచ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సొసైటీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర రాజధాని అమరావతి భవిష్యత్తును మార్చే ఒక అత్యంత కీలకమైన, ప్రతిష్ఠాత్మకమైన ప్రకటన చేశారు. దేశంలోనే మొట్టమొదటి 'క్వాంటం సెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్'ను అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగానే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో దీటుగా నిలబడే క్వాంటం టెక్నాలజీ హబ్‌గా, డీప్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్‌గా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను **తక్షణమే తొలగించండి**
- రాహుల్ గాంధీ డిమాండ్



02

బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి **బర్తరఫ్ చేయాలి**
- కేటీఆర్ డిమాండ్



02

బండి భగీరథ్ కేసుకు **కేంద్రానికి సంబంధం లేదు**
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



02

# ఉప సర్పంచులకు చెక్!

## ఎప్పట్లాగే సర్పంచ్, కార్యదర్శికే జాయింట్ చెక్ పవర్

పంచాయతీల్లో ఆధిపత్య పోరుకు ఫుల్ స్టాప్

పాత పద్ధతికే పీఆర్ శాఖ ప్రతిపాదనలు.. చట్ట సవరణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు

**హైదరాబాద్ - మహా:**

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో కీలకమైన పాలనా మార్పు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామాభివృద్ధి పనుల్లో నెలకొంటున్న ప్రతిష్టంభనకు ముగింపు పలికేందుకు పంచాయతీరాజ్ శాఖ కీలక నిర్ణయం తీసుకునే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం సర్పంచ్, ఉప సర్పంచులకు ఉన్న జాయింట్ చెక్ పవర్‌ను రద్దు చేసి, దానిని తిరిగి సర్పంచ్ మరియు పంచాయతీ కార్యదర్శికి అప్పగించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపింది. ఈ ప్రతిపాదనలపై ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చ జరుగుతోంది. పాలన సజావుగా సాగుతుందని సర్పంచులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తుండగా, తమకు అన్యాయం జరుగుతుందని ఉప సర్పంచులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

**ఆధిపత్య పోరుకు చెక్ పెట్టే వ్యూహం**

రాష్ట్రంలోని అనేక గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, ఉప సర్పంచుల మధ్య తీవ్ర స్థాయి ఆధిపత్య పోరు నడుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్ అయిన సర్పంచ్ స్థానాల్లో, జాయింట్ చెక్ పవర్ అడ్డం పెట్టుకుని అగ్రవర్ణాలకు చెందిన ఉప సర్పంచులు ఆధిపత్యం చెలాయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇద్దరూ వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన వారైతే ఈ సమస్య మరింత జటిలంగా మారుతోంది. ఒకే పార్టీకి చెందిన వారైనా వర్గ విభేదాలతో పనులు ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రాజకీయ విభేదాలకు ఫుల్ స్టాప్ పెట్టే దిశగా పంచాయతీరాజ్ శాఖ ఆలోచన చేసింది.

**గ్రామాభివృద్ధికి అడ్డంకిగా మారిన జాప్యం**

గ్రామ పంచాయతీ ఖాతా నుంచి ఏ చిన్న ఖర్చుకైనా నిధులు డ్రా చేయాలంటే సర్పంచ్, ఉప సర్పంచ్ ఇద్దరి సంతకాలు తప్పనిసరి అనే నిబంధన అభివృద్ధికి పెద్ద అడ్డంకిగా మారింది. కొందరు ఉప సర్పంచులు కావాలనే సంతకాలు చేయడానికి నిరాకరిస్తున్నారని, బిల్లుల చెల్లింపులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని సర్పంచుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనివల్ల నిధుల డ్రాలో తీవ్ర జాప్యం జరిగి, చేపట్టిన పనులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే తదుపరి నిధులు కూడా ఆగిపోతున్న పరిస్థితులు ఎదురవుతున్నాయి.



**సర్పంచుల హర్షం.. ఉప సర్పంచుల ఆందోళన**

కార్యదర్శికి చెక్ పవర్ ఇచ్చే ప్రభుత్వ ప్రతిపాదనపై సర్పంచుల సంఘం హర్షం వ్యక్తం చేస్తోంది. ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా, పనులు సజావుగా సాగేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని వారు భావిస్తున్నారు. మరోవైపు, ఉప సర్పంచులు మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వార్డు సభ్యుడిగా గెలిచి ఉప సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేశామని, ఇప్పుడు తమకున్న ఏకైక అధికారాన్ని తొలగిస్తే తమ పదవికి ఏమాత్రం విలువ ఉండదని వారు వాపోతున్నారు.

**పాత పద్ధతికే అధికారుల మొగ్గు**

ఈ పరిణామాల నేపథ్యంలో నిధుల వినియోగంలో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు అధికారులు పాత పద్ధతికే మొగ్గు

మిగతా 2లో



## కేరళంకు సీఎం రేవంత్ రెడ్డి

### నేడు సీఎంగా సతీషన్ ప్రమాణస్వీకారం

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం రాత్రి కేరళం వెళ్ళారు. హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి కేరళంకు బయలుదేరివెళ్ళారు. సోమవారం కేరళంలో సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారం చేయనుండగా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇందులో పాల్గొనేందుకు వెళ్లారు. ఉదయం 10 గంటలకు తిరువనంతపురం సెంట్రల్ స్టేడియంలో కేరళం ముఖ్యమంత్రిగా సతీషన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.



## నరసరావుపేట డీఎస్పీకి తన పాస్‌పోర్ట్ అప్పగించిన విడదల రజని

- అట్రాసిటీ కేసులో హైకోర్టు ఆదేశం
- విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

**గుంటూరు, మహా:** మాజీ మంత్రి, వైసీపీ నేత విడదల రజిని తన పాస్‌పోర్ట్‌ను నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో అప్పగించారు. తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టు విధించిన షరతుల మేరకు ఆమె ఈ చర్య తీసుకున్నారు. ఆదివారం నాడు ఆమె డీఎస్పీ కార్యాలయానికి వచ్చి పాస్‌పోర్ట్ ను పోలీసులకు అందజేశారు.

మిగతా 2లో



## చైనా నౌకను సీజ్ చేసిన ఇరాన్


- సైనోగార్డ్స్ సెక్యూరిటీ నౌక అదుపులోకి..
- హోర్ముజ్‌లో ఇరాన్ ఆధిపత్య ప్రదర్శన
- సముద్ర భద్రత మా చేతుల్లోనే అన్న ఇరాన్
- చైనా నౌక సీజ్‌తో ఇరాన్ సంచలన నిర్ణయం

వివరాలు 8లో

## తెలంగాణకు హీట్‌వేవ్ అలర్ట్

### రానున్న 5 రోజులు నిప్పుల కొలిమే

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. కాగా రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రంలో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అధిక ఎండ తీవ్రతతో పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ , జగిత్యాల, మంచిర్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఇవాళ 16 జిల్లాల్లో 41 నుంచి 44 మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.



## బండి భగీరథ్ కేసులో షాకింగ్ ట్విస్ట్

సోషల్ మీడియాలో చిల్లరపోస్ట్‌లు పెట్టిన వారిపై కేసులు

జడ్జి భర్తకు బార్ కౌన్సిల్ పదవా? : కట్టుకథలపై న్యాయస్థానం ఆగ్రహం

సోషల్ మీడియా పోస్టులపై రిజిస్ట్రార్ ఫిర్యాదు.. 14 మందిపై కేసు

**హైదరాబాద్, మహా:** సామాజిక మాధ్యమాల్లో భావప్రకటన స్వేచ్ఛ ముసుగులో రాజ్యాంగ సంస్థలైన న్యాయస్థానాలపై, గౌరవ న్యాయమూర్తులపై అసత్య ప్రచారాలు చేయడం ఈమధ్య కాలంలో పెరిగిపోతోంది. తాజాగా హైదరాబాద్‌లో బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఒక మహిళా జడ్జిపై సోషల్ మీడియాలో చేసిన అనుచిత, నిరాధార వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. తీర్పులను ప్రభావితం చేసేలా, న్యాయమూర్తి వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చేలా సాగిన ఈ ప్రచారాన్ని తెలంగాణ హైకోర్టు అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యవహారంపై



ఏకంగా హైకోర్టు రిజిస్ట్రార్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయడంతో

మిగతా 2లో

## ఆదిలాబాద్‌కు రాజీవ్ జ్యోతి యాత్ర

### ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు.. రాజీవ్ గాంధీ సేవలను కొనియాడిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేవని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. తమిళనాడులోని శ్రీ పెరంబదూర్ నుండి ఢిల్లీలోని వీరభూమి వరకు సాగుతున్న రాజీవ్ గాంధీ జ్యోతి యాత్ర ఆదివారం ఆదిలాబాద్ కు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి , మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డిలతో పాటు కాంగ్రెస్ శ్రేణులతో

మిగతా 2లో



## తెలంగాణ ఎప్‌సెట్-2026 ఫలితాలు విడుదల

ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాల్లో సత్తా చాటిన విద్యార్థులు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'టీజీ ఎప్‌సెట్' ఫలితాలు అట్టహాసంగా విడుదలయ్యాయి. ఆదివారం రోజున జేఎన్టీయూ హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి తదితర ఉన్నతాధికారులు అధికారికంగా ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో అత్యుత్తమ ఉత్తీర్ణత శాతం నమోదు కావడం విశేషం. ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకోగా, అందులో 1,97,241 మంది విద్యార్థులు హాజరయ్యారు.

మిగతా 2లో






## నరసరావుపేట డీఎస్పీకి తన పాస్‌పోర్ట్ అప్పగించిన విడదల రజని

(మొదటిపేజీ తరువాయి)

వివరాల్లోకి వెళితే, చిలకలూరిపేటకు చెందిన టీడీపీ నేత పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యడ్లపాడు పోలీసులు విడదల రజిని, ఆమె అనుచరులపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు రజిని హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం, ఆమె విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్ట్‌ను తక్షణం పోలీసులకు అప్పగించాలని షరతులతో కూడిన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను పాటిస్తూ, విడదల రజిని తన న్యాయవాదులతో కలిసి నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావును కలిశారు. పాస్‌పోర్ట్‌ను ఆయనకు అందజేసి, సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత విడదల రజిని వరుస కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని బెదిరించి రూ. 2.20 కోట్లు వసూలు చేశారన్న ఆరోపణలపై ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఆమె మరిది విడదల గోపిని అధికారులు అరెస్టు కూడా చేశారు.

# బండి భగీరథ్ కేసులో షాకింగ్ ట్విస్ట్

(మొదటిపేజీ తరువాయి)

చార్మినార్ పోలీసులు కేసు నమోదు చేసి లోతైన దర్యాప్తును ముమ్మరం చేశారు.

**ముందస్తు బెయిల్ పై విచారణ**

బండి భగీరథ్‌పైన నమోదైన ఒక క్రిమినల్ కేసుకు సంబంధించి, అరెస్టు నుంచి రక్షణ పొందేందుకు ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ బాధ్యతలను జడ్జి మాధవి ఆధ్వర్యంలోని ధర్మాసనం చేపట్టింది. కోర్టులో వాదోపవాదాలు, విచారణ అత్యంత పారదర్శకంగా, చట్టబద్ధంగా కొనసాగుతున్న సమయంలోనే, ఈ కేసుతో ముడిపెట్టి సోషల్ మీడియాలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారానికి తెరతీశారు. న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మాధవిపై సామాజిక మాధ్యమాల్లో కొందరు ఆకతాయిలు మరియు ఉద్దేశపూర్వక ట్రోలర్స్ తీవ్ర స్థాయి అనుచిత వ్యాఖ్యలు చేశారు. న్యాయమూర్తి వ్యక్తిగత జీవితాన్ని ఈ కేసుతో ముడిపెడుతూ, ఆమె నైతికతను దెబ్బతీసే విధంగా అసత్యాలను ప్రచారం చేశారు. ఒక మహిళా జడ్జి అని కూడా చూడకుండా, అత్యంత జుగుప్సాకరమైన రీతిలో నిరాధారమైన ఆరోపణలు చేయడం న్యాయ వర్గాలను, పౌర సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ సోషల్ మీడియా ట్రోల్స్‌లో ప్రధానంగా ఒక తీవ్రమైన ఆరోపణను వైరల్ చేశారు. బండి భగీరథ్‌కు గనక జడ్జి మాధవి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే, దానికి ప్రతిఫలంగా ఆమె భర్తకు ప్రతిష్టాత్మకమైన బార్ కౌన్సిల్ చైర్మన్ పదవిని కట్టబెడతారనేది ఆ పోస్టుల సారాంశం. న్యాయస్థానం తీర్పులను ప్రభావితం చేసేలా, పరోక్షంగా ఒక అక్రమ లావాదేవీ జరుగుతోందన్న భ్రమను ప్రజల్లో కల్పించేలా ఈ పోస్టులను అత్యంత వ్యూహాత్మకంగా సర్క్యులేట్ చేశారు.

**విచారణలో ఆవేదన వ్యక్తం చేసిన న్యాయమూర్తి**


తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ దుష్ప్రచారాన్ని, వ్యక్తిగత దాడిని న్యాయమూర్తి మాధవి స్వయంగా బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు హాలులో ప్రస్తావించారు. న్యాయవ్యవస్థను, తన వ్యక్తిగత ప్రతిష్టను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ దాడిని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. న్యాయమూర్తులు ఏ పక్షానికీ ఒరగకుండా సాక్ష్యాధారాలు, చట్టప్రకారం నడుచుకుంటారని, ఇలాంటి అసత్య ప్రచారాలు న్యాయ ప్రక్రియను అవహేళన చేయడమేనని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు కేవలం ఒక వ్యక్తిగత న్యాయమూర్తికి సంబంధించినవి మాత్రమే కావని, ఇది మొత్తం స్వతంత్ర న్యాయవ్యవస్థ ఉనికిపై జరుగుతున్న దాడిగా న్యాయ వర్గాలు పరిగణించాయి. తమకు అనుకూలంగా తీర్పులు రాకపోతే, లేదా వస్తాయో లేదో అన్న కక్షతో న్యాయమూర్తులను బ్లాక్ మెయిల్ చేసే సంస్కృతికి ఇది నిదర్శనంగా మారింది. ఇలాంటి చర్యలను ఉపేక్షిస్తే భవిష్యత్తులో న్యాయమూర్తులు స్వేచ్ఛగా, నిర్భయంగా తీర్పులు వెలువరించే వాతావరణం దెబ్బతింటుందనే ఆందోళన వ్యక్తమైంది.

**రంగంలోకి దిగిన హైకోర్టు రిజిస్ట్రార్**

న్యాయమూర్తిపై జరుగుతున్న ఈ హేయమైన ప్రచారాన్ని తెలంగాణ హైకోర్టు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. న్యాయవ్యవస్థ గౌరవాన్ని, న్యాయమూర్తుల రక్షణను కాపాడే బాధ్యతలో భాగంగా, హైకోర్టు రిజిస్ట్రార్ నేరుగా ఈ వ్యవహారంపై పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. న్యాయస్థానం పట్ల ప్రజల్లో ఉన్న అపారమైన నమ్మకాన్ని సడలించేలా వ్యవహరించిన ఆ సోషల్ మీడియా ఖాతాల నిర్వాహకులపై కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు. హైకోర్టు రిజిస్ట్రార్ ఇచ్చిన అధికారిక ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్‌లోని చార్మినార్ పోలీసులు తక్షణమే స్పందించారు. సంబంధిత వ్యక్తులపై ఐటీ చట్టం మరియు ఇతర కఠినమైన క్రిమినల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆ వివాదాస్పద పోస్టులు ఎక్కడి నుంచి పోస్ట్ అయ్యాయి, వాటి వెనుక ఉన్న మాస్టర్ మైండ్ ఎవరు అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసుల సాంకేతిక సహకారంతో దర్యాప్తును వేగవంతం చేశారు. నిందితుల ఐపీ అడ్రస్‌లను ట్రేస్ చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

# ఉప సర్పంచులకు చెక్!

(మొదటిపేజీ తరువాయి)




చూపుతున్నారు. గతంలో మాదిరిగానే ఉప సర్పంచుల స్థానంలో పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్‌లకు ఉమ్మడి చెక్ పవర్ ఇవ్వాలని ప్రభుత్వానికి పీఆర్ శాఖ ప్రతిపాదనలు పంపింది. ఒక రాజకీయ ప్రతినిధిగా సర్పంచ్, ప్రభుత్వ ప్రతినిధిగా పంచాయతీ కార్యదర్శి ఇద్దరూ నిధులను పర్యవేక్షించడం వల్ల జవాబుదారీతనం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. నిధుల దుర్వినియోగం జరిగితే కార్యదర్శిని బాధ్యుడిని చేసి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

**చట్ట సవరణ లేదా ఆర్డినెన్స్ ద్వారా అమలు**

ఉప సర్పంచులకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేసి, కార్యదర్శికి ఇవ్వాలంటే కచ్చితంగా చట్ట సవరణ చేయాల్సిందే. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం2018కు సవరణలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాల్సి ఉంటుంది. ఒకవేళ అసెంబ్లీ సమావేశాలు అందుబాటులో లేని పక్షంలో గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఈ మార్పును అమలు చేసే వీలుందని, ఆ తర్వాత ఆరు నెలల్లోగా అసెంబ్లీలో ఆమోదం పొందవచ్చని న్యాయ నిపుణులు వివరిస్తున్నారు. దేశవ్యాప్తంగా పంచాయతీల్లో చెక్ పవర్ విధానం ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కోలా ఉంది. అయితే, మన పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శికి లేదా డెవలప్‌మెంట్ ఆఫీసర్‌కు మాత్రమే జాయింట్ చెక్ పవర్ అమల్లో ఉంది. తెలంగాణలో కూడా 2018కి ముందు ఇదే పద్ధతి విజయవంతంగా సాగింది. దేశంలోని ఇతర రాష్ట్రాల పనితీరును ప్రాతిపదికగా తీసుకునే ఇప్పుడు మళ్లీ కార్యదర్శులకు ఈ అధికారాన్ని కట్టబెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం ప్రతి పంచాయతీలో ప్రత్యేక ఖాతా తెరవాలని ఆదేశించింది. ఈ నిధుల చెల్లింపులకు కేవలం సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల డిజిటల్ సంతకాలను మాత్రమే తప్పనిసరి చేశారు. ఈ డిజిటల్ విధానం వల్ల నిధుల బదిలీలో ఎక్కడా జాప్యం జరగకుండా పూర్తి స్థాయి పారదర్శకత ఏర్పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వ నిధులకు కూడా ఇదే తరహా పద్ధతిని తీసుకురావడం వల్ల గ్రామ స్థాయిలో పరిపాలన మరింత వేగవంతం కానుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

## బండి భగీరథ్ కేసుకు కేంద్రానికి సంబంధం లేదు

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, మహా :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్టు అయ్యాడని, అంశంపై ఈ సమయంలో చర్చించాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కేసుతో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. పూర్తిగా రాష్ట్ర పోలీసులే ఈ వ్యవహారాన్ని చూసుకుంటారని, విపక్షాలు విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చి మోసం చేసిందని, కనీసం రైతులు పండించిన ధాన్యం కొనలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తన నిర్లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం మీద, అధికారుల మీద నెట్టేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. రైతు రుణమాఫీ పూర్తి చేయలేదు, రైతు కూలీలకు, కౌలు రైతులకు హామీ ఇచ్చి మోసం చేసింది.. లక్షల మంది రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యంతో బ్యాంకుల్లో డీఫాల్టర్లుగా మారారు.. అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల విషయాలపై ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి, మంత్రులు ఎదురుదాడులపైనే దృష్టి పెడుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలో సజావుగా కొనుగోళ్లు ఎందుకు చేయడం లేదో చెప్పలేని పరిస్థితి.. ఈసారి కూడా దిగుబడి పెరిగిందని దానికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టడం లేదన్నారు.

# చైనా నౌకను సీజ్ చేసిన ఇరాన్

**హైదరాబాద్, మహా:** అంతర్జాతీయ రాజకీయాల్లో ఎప్పుడు ఎలాంటి పరిణామాలు జరుగుతాయో ఊహించడం కష్టం. తాజాగా మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రపంచ దేశాలకు చమురు సరఫరాలో అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ అనూహ్యమైన, సంచలన నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయంగా తనకు ఎంతో అండగా ఉంటున్న మిత్రదేశం చైనాకు చెందిన ఒక నౌకను ఇరాన్ సీజ్ చేయడం ప్రపంచ వ్యాప్తంగా కలకలం రేపుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా పర్యటనలో ఉన్న సమయంలోనే ఈ ఘటన జరగడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ అనూహ్య పరిణామం వెనుక ఇరాన్ ఆధిపత్య వ్యూహాలు, సముద్ర జలాలపై తన పట్టును నిరూపించుకునే ప్రయత్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**హోర్ముజ్‌లో అనూహ్య తనిఖీలు**

హోర్ముజ్ జలసంధి సముద్ర జలాల్లో ప్రయాణిస్తున్న ఒక ప్రైవేటు నౌకను ఇరాన్ భద్రతా బలగాలు అకస్మాత్తుగా అడ్డుకున్నాయి. తనిఖీల పేరిట ఆ నౌకను తమ అదుపులోకి తీసుకున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) లోని ఫుజైరా తీరానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నౌకకు సంబంధించిన సరైన పత్రాలు ఉన్నాయో లేదో పరిశీలించాలనే నెపంతో



ఇరాన్ అధికారులు ఈ చర్యకు దిగి, నౌకను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

**చైనా సెక్యూరిటీ నౌకగా గుర్తింపు**

ఇరాన్ సీజ్ చేసిన ఈ నౌక సాధారణ వాణిజ్య నౌక కాదు. ఇది చైనాకు చెందిన ఒక ప్రైవేట్ షిప్పింగ్ సెక్యూరిటీ సంస్థకు చెందినదిగా అంతర్జాతీయ వర్గాలు నిర్ధారించాయి. 'సైనోగార్డ్స్ మెరీన్ సెక్యూరిటీ' అనే సంస్థకు చెందిన ఈ నౌక, సముద్ర మార్గంలో ప్రయాణించే ఇతర వాణిజ్య నౌకలకు సాయుధ దళాలతో భద్రత కల్పిస్తుంటుంది. సముద్రపు దొంగల నుంచి వాణిజ్య నౌకలను రక్షించే అతి కీలకమైన విధుల్లో ఈ నౌక ఉంటుంది.

**హాంకాంగ్ రిజిస్ట్రేషన్.. హోండురాస్ జెండా**

ఈ నౌక కార్యకలాపాల నేపథ్యం అత్యంత ఆసక్తికరంగా ఉంది. ఈ నౌకను నిర్వహిస్తున్న సైనోగార్డ్స్ సంస్థ వాస్తవానికి హాంకాంగ్‌లో రిజిస్టర్ అయ్యింది. అయితే, ఈ నౌక మాత్రం హోండురాస్ దేశపు జెండాతో సముద్రంలో తన కార్యకలాపాలు నిర్వర్తిస్తోంది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే చైనా మరియు ఇతర దేశాల నౌకలకు భద్రత కల్పించే ఉద్దేశ్యంతోనే చైనా సంస్థ ఈ నౌకను అక్కడికి పంపినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది.

**ట్రంప్ పర్యటనతో ముడిపడిన టైమింగ్**

ఈ నౌక సీజ్ ఘటన జరిగిన సమయం అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాలో పర్యటిస్తున్న తరుణంలోనే ఇరాన్ ఈ సాహసోపేతమైన అడుగు వేయడం గమనార్హం. అమెరికాను బద్ధ శత్రువుగా భావించే ఇరాన్, తన మిత్రదేశమైన చైనాతో అమెరికా మైత్రీ బంధాన్ని పెంపొందించుకోవడాన్ని సహించడం లేదన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సరైన సమయంలో దెబ్బ కొట్టడం ద్వారా ఇరాన్ బహుముఖ సందేశాలను పంపింది.

**హోర్ముజ్‌పై ఇరాన్ ఆధిపత్య ప్రదర్శన**

హోర్ముజ్ జలసంధి అనేది ఇరాన్ తన గుప్పెట్లో ఉంచుకోవాలని తీవ్రంగా భావించే అత్యంత వ్యూహాత్మక ప్రాంతం. ఈ సముద్ర మార్గంలో సాయుధ దళాలతో భద్రతను కల్పించే హక్కు కేవలం తమకు మాత్రమే ఉందని ఇరాన్ బలంగా నమ్ముతోంది. ఇక్కడ ఇతర దేశాల ప్రైవేట్ లేదా ప్రభుత్వ భద్రతా దళాలు పెత్తనం చెలాయించడాన్ని ఇరాన్ ఏమాత్రం అంగీకరించదు. ఈ ఘటన ద్వారా తమ జలాల్లో తామే బాస్ అని ఇరాన్ స్పష్టం చేసింది.

**మిత్రదేశాలకైనా మినహాయింపుల్లేవ్!**

చైనా దశాబ్దాలుగా ఇరాన్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా, అంతర్జాతీయ వేదికలపై నమ్మకమైన మిత్రదేశంగా కొనసాగుతోంది. పాశ్చాత్య దేశాల ఆంక్షలను ఎదుర్కోవడంలో ఇరాన్‌కు చైనా ఎంతో అండగా నిలిచింది. అయినప్పటికీ, జాతీయ భద్రత, హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించే విషయంలో ఎంతటి మిత్రదేశాలకు కూడా ఎలాంటి మినహాయింపులు ఇవ్వబోమని ఇరాన్ కుండబద్దలు కొట్టింది. నిబంధనల విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది.

**మౌనం వహిస్తున్న చైనా సంస్థ**

తమ భద్రతా నౌకను ఇరాన్ సీజ్ చేసిన ఘటనపై చైనాకు చెందిన సైనోగార్డ్స్ కంపెనీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. అసలు ఇతర నౌకలకు భద్రత కల్పించేందుకే ఆ నౌకను హోర్ముజ్‌కు పంపారా, లేక వేరే ఇతర కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలకు ఆ సంస్థ సమాధానం దాటవేస్తోంది. చైనా ప్రభుత్వం సైతం ఈ అనూహ్య ఘటనపై ఆచితూచి స్పందిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఇరాన్ సహనానికి ఇదొక హెచ్చరిక**

ఇది కేవలం ఒక చిన్న నౌక తనిఖీ వ్యవహారం కాదని, హోర్ముజ్ జలసంధి భద్రత విషయంలో తమ సహనానికి కూడా ఒక హద్దు ఉందని ఇరాన్ పరోక్షంగా ప్రపంచ దేశాలకు తీవ్రమైన హెచ్చరిక జారీ చేసిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భవిష్యత్తులో ఈ జలసంధి గుండా ప్రయాణించే విదేశీ నౌకలు కఠినమైన ఇరాన్ నిబంధనలను, తనిఖీలను కచ్చితంగా ఎదుర్కోక తప్పదన్న కఠిన సంకేతాలు ఈ ఘటన ద్వారా వెలువడ్డాయి.

## బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి

**కేటీఆర్ డిమాండ్**

**హైదరాబాద్, మహా :** పోక్సో చట్టం కింద బండి భగీరథ్ అరెస్ట్ అయిన నేపథ్యంలో ఈ కేసు నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని ప్రధాని మోదీని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్ బీ నగర్‌లో నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రధాని మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అంటున్నారన్నారు. కేవలం ఇది నినాదాలకే పరిమితమైతే న్యాయం జరగదని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారి కేంద్రమంత్రి కుమారుడి మీద లుకౌట్ నోటీస్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని చెప్పారు.

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే తొలగించండి

**రాహుల్ గాంధీ డిమాండ్**

**ఢిల్లీ, మహా:** నీట్ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ని మంత్రివర్గం నుంచి తొలగించాలని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ప్రధాని మోదీకి మరోసారి పలు ప్రశ్నలు సంధిస్తూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా సంబంధిత కేంద్ర మంత్రి రాజీనామా చేయకపోవడం, ప్రధాని మౌనంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మోదీ గారూ.. దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది. వాటికి సమాధానం చెప్పండి. పేపర్ లీక్ ఘటనలు పదేపదే ఎందుకు జరుగుతున్నాయి?. ఈ పరీక్షా పత్రాల లీక్‌పై మీరు ఎప్పుడూ ఎందుకు మౌనం వహిస్తున్నారు?. పదేపదే విఫలమవుతున్న విద్యాశాఖ మంత్రిని ఎందుకు తొలగించడం లేదు?' అంటూ ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు.



## ఆదిలాబాద్‌కు రాజీవ్ జ్యోతి యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

కలిసి ఆయన జ్యోతీ యాత్రకు ఘన స్వాగతం పలికారు.1984 నుండి 1989 వరకు ప్రధానిగా దేశంలో ఐటీ విప్లవానికి నాంది పలికిన గొప్ప మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆయన చాలా చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోవడం దేశానికి తీరనిలోటని అన్నారు. ఆయన మెమోరియల్ యాత్రను ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్న శామ్యూల్ ద్రవ్యమ్ గారికి ఆయన బృందానికి అభినందనలు తెలిపారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ఆయన సిద్ధాంతాలను ముందుకు తీసకెళ్లతామని ఆయన అన్నారు. ఆయన యాత్రకు స్వాగతం పలకడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్ ఆదిలాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కిజర్ పాషా, నాయకులు బెజ్జంకి అనిల్ ,మోతిరామ్ ,గౌలి సంజయ్ ,పరమేశ్వర్ , శ్రీకర్ గౌడ్ ,కుదురుపాక సురేష్ , కోలా నర్సింలు , తొడసం దౌలత్ రావు,షకీల్, రఫీక్ , సురేందర్, దేరా కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి వేదికగా డిజిటల్ విప్లవం

(మొదటిపేజీ తరువాయి)

అధునాతన మౌలిక సదుపాయాలతో అత్యాధునిక పరిశోధనలకు ఊతమిస్తూ, రాష్ట్ర యువతను గ్లోబల్ టెక్ ప్రపంచానికి సిద్ధం చేసేలా ఈ బృహత్తర ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది.

**సాంకేతిక భవిష్యత్తుకు బలమైన పునాది**

మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా డేటా భద్రత, సురక్షిత నెట్‌వర్క్ వ్యవస్థల ఆవశ్యకతను గుర్తిస్తూ ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సురక్షిత కమ్యూనికేషన్లు, విశ్వసనీయ డిజిటల్ మౌలిక సదుపాయాలు, అభేద్యమైన సైబర్ భద్రత రాబోయే రోజుల్లో ఏ దేశానికైనా లేదా రాష్ట్రానికైనా అత్యంత కీలకమని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. ఈ సాంకేతిక అవసరాలను ముందుగానే పసిగట్టిన ప్రభుత్వం, రాష్ట్రాన్ని టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు బలమైన పునాదులు వేస్తోంది. కేవలం భౌతిక నిర్మాణాలకే పరిమితం కాకుండా, అత్యున్నత మేధోసంపత్తికి రాజధానిని కేంద్రంగా మార్చే బృహత్తర లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. భారతదేశ సాంకేతిక చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా అమరావతి కేంద్రంగా తొలి 'క్వాంటంసెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్' ఏర్పాటు కాబోతోంది. ఈ అత్యాధునిక ప్రయోగశాల దేశ భద్రతా వ్యవస్థలకు, సైబర్ రక్షణకు అవసరమైన అత్యున్నత స్థాయి కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. సాంప్రదాయ ఎన్‌క్రిప్షన్ విధానాలకు కాలం చెల్లుతున్న నేపథ్యంలో, క్వాంటం టెక్నాలజీ ఆధారిత కమ్యూనికేషన్లను అభివృద్ధి చేయడానికి ఈ టెస్ట్ బెడ్ ఒక అద్భుతమైన వేదికగా నిలవనుంది. ఇది అమరావతిని జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక టెక్నాలజీ కారిడార్‌గా మార్చబోతోంది. ఇంతటి భారీ ప్రయోగాన్ని ఏకపక్షంగా కాకుండా దేశంలోని అత్యున్నత విద్యా, పరిశోధనా సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. ప్రతిష్టాత్మక ఎస్ఆర్ఎం యూనివర్సిటీ (ఏపీ), భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ల విభాగానికి చెందిన సీడాట్ , అమరావతి క్వాంటం వ్యాలీ సంయుక్త భాగస్వామ్యంతో ఈ క్వాంటంసెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్ రూపుదిద్దుకుంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, అకాడమిక్ వర్గాల కలయికతో ఈ ప్రాజెక్టు అత్యంత ప్రామాణికంగా, అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా అభివృద్ధి చెందుతోంది. ఈ టెస్ట్ బెడ్ ద్వారా సైబర్‌స్పేస్ భద్రత, నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్ రంగాల్లో లోతైన, అత్యాధునిక పరిశోధనలు జరగనున్నాయి. ముఖ్యంగా క్వాంటం కమ్యూనికేషన్ హార్డ్‌వేర్, ఫోటోనిక్, ఆప్టికల్ సిస్టమ్స్, అధునాతన ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీలపై విస్తృత ప్రయోగాలు నిర్వహిస్తారు. సైబర్ దాడులను తిప్పికొట్టేలా నెక్స్ట్ జనరేషన్ సైబర్ డిఫెన్స్ సొల్యూషన్స్‌ను ఇక్కడే అభివృద్ధి చేస్తారు. సురక్షిత నెట్‌వర్క్ మౌలిక సదుపాయాల కల్పనలో తలెత్తే సవాళ్లను అధిగమించడానికి అవసరమైన పరీక్షలను నిర్వహించి, ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనడానికి ఈ కేంద్రం ఒక ప్రధాన వేదికగా మారనుంది. ఇప్పటికే రాష్ట్రంలో క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి నాంది పలికిన ప్రభుత్వం, ఈ ప్రాజెక్టు ద్వారా మరో ముందడుగు వేసింది. గత ఏప్రిల్ 14వ తేదీన ప్రారంభించిన 'క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్' తర్వాత ఇది అత్యంత కీలకమైన మైలురాయిగా నిలిచింది. ఒక పద్ధతి ప్రకారం, అంచలంచెలుగా అమరావతిలో 'క్వాంటం వ్యాలీ' ని నిర్మించాలన్న ప్రభుత్వ ప్రణాళికలు వాస్తవరూపం దాల్చుతున్నాయి. భవిష్యత్తులో ఈ క్వాంటం వ్యాలీ ప్రాజెక్టు కేవలం దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రత్యేక గుర్తింపు పొందడం ఖాయంగా కనిపిస్తోంది.

### యువత, స్టార్టప్‌లకు అపార అవకాశాలు

**ఈ ప్రాజెక్టు వల్ల ప్రధానంగా లబ్ధి పొందేది రాష్ట్రంలోని యువత, విద్యార్థులు మరియు యువ పరిశోధకులే. వారికి అంతర్జాతీయ స్థాయి పరిశోధనా అవకాశాలు సొంత రాష్ట్రంలోనే లభిస్తాయి. కొత్త ఆవిష్కరణలు చేయాలనుకునే స్టార్టప్‌లకు ఈ టెస్ట్ బెడ్ ఒక లాంచ్‌ప్యాడ్‌లా పనిచేస్తుంది. క్వాంటం టెక్నాలజీ, సైబర్ భద్రత లాంటి అత్యంత డిమాండ్ ఉన్న రంగాల్లో ప్రత్యక్ష భాగస్వామ్యం కల్పించడం ద్వారా, యువత భవిష్యత్తును గ్లోబల్ ప్రమాణాలకు తీర్చిదిద్దే అద్భుతమైన అవకాశం ఈ వేదిక ద్వారా అందుబాటులోకి వస్తుంది.**

## తెలంగాణ ఎప్‌సెట్-2026 ఫలితాలు విడుదల

ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాల్లో సత్తా చాటిన విద్యార్థులు

(మొదటిపేజీ తరువాయి)

వీరిలో ఏకంగా 1,44,704 మంది అనగా 73.36 శాతం విద్యార్థులు అర్హత సాధించారు. అదేవిధంగా అగ్రికల్చర్ మరియు ఫార్మసీ విభాగంలో 84,954 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, వారిలో 73,294 మంది అనగా 86.27 శాతం మంది అర్హత సాధించి ఉన్నత విద్యాభ్యాసానికి మార్గం సుగమం చేసుకున్నారు. ఈ ఏడాది ఫలితాల్లో టాప్ ర్యాంకర్ల వివరాలను పరిశీలిస్తే, ఇంజినీరింగ్ విభాగంలో మేడ్చల్ పరిధిలోని ఉప్పల్‌కు చెందిన ఎం. రుషి అద్భుతమైన ప్రతిభ కనబరిచాడు. ఏకంగా 156.63 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. అలాగే మూసాపేట్‌కు చెందిన అన్షుల్ ద్వితీయ స్థానంలో, కడప జిల్లా పులివెందులకు చెందిన ఎం. వంశీధర్‌రెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. వీరితో పాటు గుంటూరుకు చెందిన జె.రోషన్ మణిదీప్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌కు చెందిన ఎ.సాయి నిఖిత్, మేడ్చల్‌కు చెందిన ఎం.ఆస్నా, హైదరాబాద్‌కు చెందిన వి.శరద్ మహేశ్వరి, టి.శ్రేయాస్‌రెడ్డి, రంగారెడ్డికి చెందిన బి.సమీరాజ్‌రెడ్డి, మరియు ఆర్.జయంత్ శేఖర్ వరుసగా మొదటి పది ర్యాంకుల్లో నిలిచి తమ సత్తా చాటారు.

మరోవైపు అగ్రికల్చర్ మరియు ఫార్మసీ విభాగంలోనూ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. ఈ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ముక్కరం అహ్మద్ 150.17 మార్కులతో మొదటి ర్యాంకును సొంతం చేసుకోగా, హైదరాబాద్‌కే చెందిన టి.నివృత్ సాయి కిరణ్ ద్వితీయ ర్యాంకును, రంగారెడ్డి జిల్లాకు చెందిన జి.సాహితి గీతిక తృతీయ ర్యాంకును సాధించారు. ఎం.జయసింహ, ఎ.అన్వాస్, సత్యసాయి జిల్లాకు చెందిన ఎన్.జెరూష, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పి.అనురాగ్, సూర్యాపేటకు చెందిన బి.సాయిశరణ్, తూర్పుగోదావరికి చెందిన ఎం.సత్యశ్రీకర్, మేడ్చల్‌కు చెందిన ఎం.రుతుంబిక ఈ విభాగంలో టాప్ టెన్ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఈ అద్భుత ఫలితాలపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అమితానందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు తమ ర్యాంకు కార్డులను మరియు మార్కుల మెమోలను తెలంగాణ ఉన్నత విద్యామండలి అధికారిక వెబ్‌సైట్ eapcet.tgche.ac.in లేదా ఈనాడు ప్రతిభ వెబ్‌సైట్ ద్వారా సులభంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్ మరియు పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి ఫలితాలను తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. ఇక అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ తదితర కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను మరో వారంలో విడుదల చేయనున్నట్లు విద్యామండలి ఛైర్మన్ వెల్లడించారు. జూన్ మొదటి వారం నాటికి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించి, త్వరితగతిన ప్రవేశాలు పూర్తి చేసే దిశగా ఉన్నత విద్యామండలి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

## సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య 38కి పెంపు

కేంద్రం ఆర్డినెన్స్ కు రాష్ట్రపతి ఆమోదముద్ర

**ఢిల్లీ, మహా:** భారత న్యాయవ్యవస్థలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టుపై ఉన్న కేసుల భారాన్ని తగ్గించే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలక అడుగు వేసింది. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారికంగా ఆమోదముద్ర వేశారు. దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల నుంచి సుప్రీంకోర్టుకు చేరుకుంటున్న అప్పీళ్లు, వ్యాజ్యాల సంఖ్య భారీగా పెరిగిపోవడం, ఏకంగా 96 వేల కేసులు పెండింగ్‌లో ఉండటంతో ఈ చారిత్రక నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి నెలకొంది.



తాజా ఆర్డినెన్స్ ప్రకారం భారత సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల మంజూరైన సంఖ్య (సాంక్షన్డ్ స్ట్రెంత్) 34 నుంచి 38కు పెరిగింది. దేశ జనాభా, పెరుగుతున్న న్యాయ అవసరాల దృష్ట్యా సుప్రీంకోర్టు ప్రారంభమైన నాటి నుంచి కాలానుగుణంగా జడ్జీల సంఖ్యను పెంచుకుంటూ వస్తున్నారు. గతంలో 2019లో ఒకసారి ఈ సంఖ్యను పెంచగా, ఇప్పుడు మళ్లీ ఏకంగా నలుగురు న్యాయమూర్తుల పోస్టులను అదనంగా సృష్టిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనిద్వారా సుప్రీంకోర్టులో మరిన్ని ధర్మాసనాలు (బెంచ్‌లు) ఏర్పాటు చేసి, ఏక కాలంలో ఎక్కువ కేసులను విచారించే వెసులుబాటు కలుగుతుంది.

# పిల్లల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపిన స్ఫూర్తి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను ప్రశంసించిన ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు**

**ఉత్తమశ్రేణి విద్యార్థులకు రూ. 10000 ప్రోత్సాహకం అందజేత**

**మహా వరంగల్ బ్యూరో ;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా విద్యా విద్యా వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా డిసిసి బ్యాంక్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మద్దన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు రిటైర్డ్ ఐపీఎస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కుడా చైర్మన్ వెనుగల వెంకట్రామిరెడ్డి పాల్గొని జిల్లాలోని ఉత్తమ శ్రేణి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ 10 000 విలువ గల చెక్కులు పంపిణీ చేశారు.ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఆరుగురు టాప్ ర్యాంకర్లకు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి తన సొంత డబ్బులతో ఒక్కొక్కరికి రూ.10000 చెక్కులు విద్యార్థినులకు బహుమతిగా అందించడం జరిగింది. విద్యా వారోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి చేతిలో మీదుగా బహుమతి అందుకున్న విద్యార్థితో పాటు ఈ టాప్ ర్యాంకర్లలో ఎస్ఎస్సి ఇంటర్మీడియట్ అండ్ స్పోర్ట్ విద్యార్థినులు ఉన్నారు.ఈ విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు (రిటైర్డ్ ఐపీఎస్) విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగం చేశారు.నేటి విద్యా వ్యవస్థలో మారుతున్న పోకడలు, క్రమశిక్షణ లోపించడంపై ఆయన తనదైన శైలిలో స్పందించారు.తాను ఒక సాధారణ పోలీస్ కానిస్టేబుల్ కుమారుడినని, ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకున్నానని ఎమ్మెల్యే గుర్తు చేశారు.ప్రైవేట్ విద్యాసంస్థల కంటే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులే అత్యంత ప్రతిభావంతులు, క్వాలిఫైడ్ అని ఆయన కొనియాడారు.ఎన్నో ఒడిదుడుకులు, కష్టాలను ఎదుర్కొని, హార్డ్ వర్క్‌ను నమ్ముకుని తాను ఐపీఎస్ అధికారిగా విజయం సాధించానని, కష్టపడితేనే ఫలితం ఉంటుందని విద్యార్థులకు హితవు పలికారు.



ఈ సందర్భంగా ఆయన నేటి విద్యా విధానంలో క్రమశిక్షణ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులు కష్టపడి మంచి మార్కులతో సాధించినట్లయితే ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని వారు పేర్కొన్నారు.

మొక్కై వంగనిది మానై వంగునా" అన్నట్లు చిన్నప్పుడే పిల్లలకు క్రమశిక్షణ తప్పనిసరి అన్నారు. అలాగే, ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ 1) కాలం నడుస్తోందని, సాంకేతికతతో మనం పోటీ పడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా తమను తాము అప్‌డేట్ చేసుకోవాలని, అప్పుడే విద్యార్థులకు సరైన దిశానిర్దేశం చేయగలమని సూచించారు.పిల్లలను కేవలం స్కూల్‌కు పంపించి చేతులు దులుపుకుంటే తల్లిదండ్రుల బాధ్యత తీరిపోదని వారు అన్నారు.ఉపాధ్యాయుల కంటే తల్లిదండ్రులకే ఎక్కువ బాధ్యత ఉండాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు.విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసుకొని ఇంటర్, డిగ్రీల్లోకి అడుగుపెడుతున్న వేళ స్వేచ్ఛా విహంగుల్లా మారుతుంటారని, వారిని గమనిస్తూ ఉండాలని.. ఏఎస్కే అనే ముఖ్యమైన సూత్రాన్ని అందరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల గైడెన్స్, తల్లిదండ్రుల సపోర్ట్ వల్లే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో తన నియోజకవర్గంలో హైయెస్ట్ ర్యాంకు వచ్చిన స్కూల్ కి 10 లక్షల రూపాయలను స్కూల్ కి అందిస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో "స్ఫూర్తి" కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేసి విద్యార్థులకు భవిష్యత్‌పై అవగాహన కల్పించేందుకు మోటివేషనల్ క్లాసులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి, చదువుపై ఆసక్తి పెంపొందించడంలో "స్ఫూర్తి" కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రజాప్రతినిధులను కూడా "స్ఫూర్తి" కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఈ సందర్భంగా సూచించారు. అదేవిధంగా, "స్ఫూర్తి" కార్యక్రమంలో పాటు పరీక్షల సమయంలో అదనపు క్లాసుల నిర్వహణ లో తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం ఈవెనింగ్ స్నాక్స్ అందించడం తో అట్టి సౌకర్యాన్ని పిల్లలు సద్వినియోగంచెసున్నారని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంతో పాటు నాణ్యమైన విద్య అందించడంలో పాఠశాల హెడ్‌మాస్టర్లు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు. "స్ఫూర్తి" కార్యక్రమం ఇదే విధంగా కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం మరింత పెరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ చిన్నప్పుడు మేమంతా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వాళ్ళమేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు.కార్యక్రమంలో చివరిగా చిన్నారులతో కల్చరల్ కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అతను కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవో సుమ,డి ఓ రంగయ్య నాయుడు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ రావు, ఏ సి జి ఈ అరుణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## యువజన, క్రీడల వారోత్సవాలను విజయవంతం చేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా యువతలో నైపుణ్యాభివృద్ధి, శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక 99 యాక్షన్ ప్లాన్లో భాగంగా మే18 నుండి మే 23 వ తేది వరకు యువజన, క్రీడల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. మే 18న ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ మారథాన్, వాక్ థాన్ ఫిజికల్ లిటరసీ కార్యక్రమాన్ని జిల్లా స్థాయి పరుగు, నడక తో ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మే 19న కెరీర్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ డే" సందర్భంగా యువతకు ఉపాధి, నైపుణ్యాలపై శిక్షణ పై అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.మే 20న యూత్ లీడర్‌షిప్ సమ్మిట్, లీడ్ విత్ విజన్, ఇన్‌స్పైర్ ది ఫ్యూచర్" పేరిట క్విజ్, పెయింటింగ్, కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మే 21న ప్లే అండ్ పార్టిసిపేట్ స్పోర్ట్స్ డే"లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.మే 22న సర్వ్ అండ్ సపోర్ట్ యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ" కార్యక్రమం కింద క్రీడా మైదానాల శుభ్రత ఈనెల 8న నిర్వహించిన జాబ్ మేళాలో ఎంపిక అయిన వారికి నియామక పత్రాలు అందజేస్తామన్నారు. మే 23న "ఉద్యోగ సాధన, కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చునిటీస్" కార్యక్రమంలోయువత ఈ వారోత్సవాల్లో చురుకుగా పాల్గొని అవకాశాలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## నక్కలగుట్ట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాలు ఆకస్మిక తనిఖీ

- **జిల్లా కలెక్టర్, ఇన్చార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయి**
- **జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి**



**మహా వరంగల్ బ్యూరో;** జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు జీడబ్ల్యూఎంసీ ఇంచార్జ్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి అధికారులకు సూచించారు.ఆదివారం కలెక్టర్ ఖాజీపేట పరిధిలోని నక్కలగుట్ట, వరంగల్‌లోని కాశిబుగ్గ జీడబ్ల్యూఎంసీ సర్కిల్ కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి జనగణన వివరాల సేకరణ పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో నమోదవుతున్న వివరాలు, డేటా ఎంట్రీ పురోగతి, సిబ్బంది పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జనగణన ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రక్రియను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు.ఈ తనిఖీల్లో ఉప కమిషనర్లు డీసీ బీర్రు శ్రీనివాస్, ప్రసన్నరాణి ఆర్ ఓ లు, ఆర్ ఐలు, టెక్నీకల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఖిలా వరంగల్‌లో మాక్ ఎక్సర్‌సైజ్

- **ప్రకృతి విపత్తులు, వరదల పై ప్రజలకు అవగాహన**
- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లాలో ప్రకృతి విపత్తుల తో పాటు వరదల పై మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్న ప్రకృతి విపత్తు మరియు వరదలపై మాక్ డ్రిల్ ఏర్పాట్లను ఆదివారం సందర్శించారు.సోమవారం ఉదయం 8 00 గంటల నుండి మధ్యాహ్నం 1 00 గంటల వరకు ఈ మాక్ డ్రిల్ జరుగుతుందని వారు పేర్కొన్నారు.ఖిలా వరంగల్ లోని ఏకశిలా పార్కు సమీపంలోని గుండు చెరువు వద్ద మాక్ ఎక్సర్‌సైజ్ స్థలాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఆరెల్ల బుచ్చయ్య స్కూల్ లో పునరా వాస కేంద్రం మరియు హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. మాడ్రిల్ సందర్భంగా స్టేజి ఏరియా ఇన్సిడెన్స్ రెస్పాన్స్ సెంటర్ రిలీఫ్ క్యాంప్ ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం అత్యవసర సహాయక చర్యలు వైద్య సేవలు తాగునీరు, ఆహార సరఫరా వంటి అంశాల్లో అన్ని శాఖల సమన్యంతో పనిచేయాలని సూచించారు. మాక్ డ్రిల్ నిర్వహణలో పాల్గొనే రెవెన్యూ పోలీస్ ఫైర్ వైద్య విద్యుత్ ఆర్ అండ్ బి మున్సిపల్, పశుసంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో వేగవంతమైన స్పందన ప్రజల రక్షణ మరియు శాఖల మధ్య సమన్వయన్ని పెంపొందించేందుకు ఈ మాగ్రిల్ ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్శనలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవో సుమ, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, వరంగల్, ఖిలా వరంగల్ తహసిల్దార్లు ఇక్బాల్ శ్రీకాంత్ , సంబంధిత శాఖల అధికారులు ఈ సందర్శనల్లో జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**మహా వరంగల్ బ్యూరో ;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం 18 05 2026 తేదీన జరిగే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో వివిధ శాఖలు సమన్వయంతో చేపట్టే సహాయక చర్యలు, రెస్క్యూ బృందాల పనితీరు విధానాన్ని తెలియజేప్పే మాక్ ఎక్సర్సైజ్ (డ్రిల్ )ను ఖిలా వరంగల్ లోని గుండు చెరువు వద్ద. నిర్వహించనున్న మాక్ ఎక్ససైజ్ సోమవారం నిర్వహిస్తున్న కారణంగా ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు.ప్రజావాణి రద్దు విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు. వచ్చే సోమవారం యథావిధిగా జిల్లా కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## నేటి ప్రజావాణి కార్యక్రమాలు రద్దు

- **మాక్ డ్రిల్ నిర్వహణ నేపథ్యంలో నిర్ణయం**
- **హన్మకొండ జిల్లా కలెక్టర్, ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయి**


**మహా వరంగల్ బ్యూరో;** జిడబ్లుఎంసి ప్రధాన కార్యాలయం అలాగే బల్దియా లో సోమవారం 18 05 2026 నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాలను రద్దు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో వివిధ శాఖలు సమన్వయంతో చేపట్టే సహాయక చర్యలు, రెస్క్యూ బృందాల పనితీరు పై అవగాహన కల్పించేందుకు జీడబ్ల్యూఎంసీ పరిధిలోని హనుమకొండ, వరంగల్ నగర ప్రాంతాల్లో సోమవారం మాక్ ఎక్సర్సైజ్ (మాక్ డ్రిల్) నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.నగరంలోని పలు ప్రాంతాల్లో మాక్ డ్రిల్ కార్యక్రమాలు జరుగనున్న నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. నగర్ ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## నేటి నుంచి పర్యాటక ఉత్సవాలు ప్రారంభం

**పోస్టర్ ను ఆవిష్కరించిన హన్మకొండ జిల్లా కలెక్టర్**

**మహా వరంగల్ బ్యూరో;** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక లో భాగంగా హనుమకొండ జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో పర్యాటక అభివృద్ధి, వారసత్వ సంపద పరిరక్షణ లక్ష్యంగా పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. శివాజీ తెలిపారు.ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొననున్నారు.మే 20న ఆత్మకూరు మండలంలోని కటాక్షాపూర్ గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మితమైన త్రికూటాలయం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, హెరిటేజ్, క్రీడలు, డీపీఆర్వో, డీఈవో శాఖలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొననున్నాయని పేర్కొన్నారు.అలాగే మే 21న హరిత కాకతీయ నక్కలగుట్టలో "మన ఊరు , మన పర్యాటకం" పేరిట సదస్సు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అనుబంధ సంస్థలు, విద్యాసంస్థలు, అధికారులు, విద్యార్థులు పాల్గొని పర్యాటక అభివృద్ధిపై అవగాహన పెంపొందించనున్నారని చెప్పారు. మే 22న జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో పర్యాటక అనుబంధ శాఖల సమన్వయంతో ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. శివాజీ తెలిపారు.

## చెరువులో మునిగి యువకుడు మృతి



**మహా వరంగల్ బ్యూరో ;**వరంగల్ జిల్లా మొగిలిచర్ల గ్రామానికి చెందిన అల్లం మహేశ్వర్, తండ్రి పాపయ్య, వయస్సు 42 సంవత్సరాలు, కులం మున్నూరుకాపు, వృత్తి కూలీ చేసుకుంటున్న వ్యక్తి కాలకృత్యాల నిమిత్తం చెరువు వైపు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయి నీటిలో మునిగి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద సంఘటన ఆదివారం మధ్యాహ్నం సుమారు 03:30 గంటలకు చోటుచేసుకుంది.స్థానికుల సహాయంతో మృతదేహాన్ని చెరువులో నుండి బయటకు తీశారు. మృతుని భార్య అల్లం రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించడం జరిగిందని గీసుగొండ సీఐడి. విశ్వేశ్వర్ తెలిపారు.

## కేఎస్సీని సందర్శించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా:** ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలో నూతనంగా వెలిసిన కేఎఫ్సీ ని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి గారు సందర్శించారు. యాజమాన్యం ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.యాజమాన్య సభ్యులకు కంది శ్రీనివాస రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారం బాగా సాగి దినాదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు...ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు బండారి సతీష్, కోలా నర్సింలు , షకీల్, రఫీక్ , సురేందర్, దేరా కృష్ణా రెడ్డి , సాహెబ్ రావు, దాసరి ఆశన్న తదితరులున్నారు.




## డాక్టర్ తోట ప్రద్యుమ్నకు అరుదైన అవార్డు

**మహా వరంగల్ బ్యూరో;** హైదరాబాదులోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ లో 23వ రీజినల్ సొసైటీ ఆఫ్ అనాటమిస్ట్స్ సదస్సు 2026 లో"ఉత్తమ మౌఖిక పరిశోధనా పత్ర సమర్పణ అవార్డును తోట బాబన్న, సంధ్య దంపతుల పెద్ద కుమారుడు డాక్టర్ తోట. ప్రద్యుమ్న ఎం.డి అందుకున్నారు. వీరు ఈఎస్ఐసీ హాస్పిటల్ సనత్ నగర్ లో ఎం.డి సెకండ్ ఇయర్ చదువుతున్నారు.ఈ సందర్భంగా వారి తండ్రి తోట బాబన్న మాట్లాడుతూ శ్రీ ధన మైసమ్మ అమ్మవారి కృపా కటాక్షం తో మా కుమారుడు ఈ అవార్డును అందుకోవడం చాలా సంతోషకరమని ఆ దంపతులు ఆనంద వ్యక్తం చేశారు..

## మందమర్రి పాత్రికేయుడు మట్టె రవీందర్‌కు మరో ఘన కిరీటం

- **రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ లిటరసీ ఎక్స్ లెన్స్ అవార్డు కైవసం**
- **ఇప్పటికే పలు పురస్కారాలు అందుకున్న కలం యోధుడికి.. కర్నూలు వేదికగా ఘన సన్మానం**



**మందమర్రి/మంచిర్యాల, మహా:** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, సాహితీవేత్త మట్టె రవీందర్ ప్రతిష్ఠాత్మక రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ లిటరసీ ఎక్సలెన్స్ అవార్డు 2026 కు ఎంపికై జిల్లాకు మరోసారి గర్వకారణంగా నిలిచారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు సెంట్రల్ లైబ్రరీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దుగ్గెలి నాగేంద్ర ముఖ్య అతిథిగా, కేవీఎస్ విద్యా సంస్థల అధినేత కేవీఎస్ రెడ్డి విశిష్ట అతిథిగా హాజరైన ఈ సభలో మట్టే రవీందర్‌ను అవార్డుతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సభకు నైస్ యూత్ సొసైటీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ అవార్డు కొరకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 70 మంది దరఖాస్తు చేసుకోగా, వివిధ రంగాల్లో సాహిత్య సేవ చేస్తున్న కేవలం 13 మందిని మాత్రమే ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అందులో మంచిర్యాల జిల్లా నుంచి రవీందర్ ఎంపిక కావడం విశేషమని వాక్యానించారు. పాత్రికేయ వృత్తిలో ఉంటూ సామాజిక అంశాలపై నిరంతరం కలం ఝుళిపిస్తున్న మట్టె రవీందర్ ఇప్పటికే పలు జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులను కైవసం చేసుకున్నారు. సమాజంలోని సమస్యలను వెలుగులోకి తేవడంలో, సాహిత్యాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని సభికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష సేవకులు జేఎస్ఆర్కే శర్మ, మురారీ శంకరప్ప, రాయపాటి నాగలక్ష్మి, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ రాహుల్, డాక్టర్ రమేష్, హరిక్రిష్ణ, అవార్డు గ్రహీత జ్యోతి తదితరులు పాల్గొన్నారు.అవార్డు అందుకున్న రవీందర్‌కు జిల్లా పాత్రికేయులు, సాహితీవేత్తలు, పలువురు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

## కష్టపడి చదివితే ఇష్టమైన ఉద్యోగాలు సాధించవచ్చు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** విద్యార్థులు కష్టపడి చదివితే ఇష్టమైన ఉద్యోగాలు సాధించవచ్చు అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యా వారోత్సవాలు విద్య విజయోత్సవ దినోత్సవం కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడం కొరకు వేలాదికోట్లను విడుదల చేసిందని అన్నారు. అందులో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలను త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ, అదనపు గదులు ఇతర సదుపాయాలు కల్పించి మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని వెల్లడించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు పైతరగతులలో మరింత నిబద్ధత, క్రమశిక్షణతో ఉన్నత విద్యను అభ్యసించాలని, ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చు అని ఆయన చెప్పారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, క్రీడా విభాగాలలో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులు ఈ విజయమే అంతిమం అనుకోకూడదని, భవిష్యత్తులో మరింత కృషి చేస్తూ ఎంచుకున్న రంగాలలో విజయం సాధించాలని స్పష్టం చేశారు. జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో 202324 విద్యా సంవత్సరంలో 91.4 శాతం, 202425 లో 96.54 శాతం, 202526 లో 97.20 శాతం ఫలితాలు సాధించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల విద్యార్థులు అన్ని రంగాలలో ముందుంటున్నారని ప్రశంసించారు. ఇదంతా ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సాధ్యమైందని తెలిపారు. 202425 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 1 లక్ష 27 వేలు ఉండగా 2025 26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 5000 పెరిగి 1 లక్ష 32 వేలుగా నమోదు అయిందని వివరించారు.జిల్లా కలెక్టర్ సూచనల మేరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు అద్భుతంగా పని చేస్తున్నాయనడానికి విద్యార్థుల సంఖ్య, ఉత్తమ ఫలితాలు నిదర్శనమని ప్రశంసలు కురిపించారు. అనంతరం జిల్లాలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన 10వ తరగతి, ఇంటర్మీడియట్, క్రీడా విభాగాల విద్యార్థులను సన్మానించి ప్రభుత్వం ప్రకటించిన ఒక్కొక్కరికి 10వేల రూపాయల నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రము, జ్ఞాపికలను అందజేశారు. అమ్మకు అక్షరమాల(ఉల్లాస్) కార్యక్రమంలో విశేషంగా సేవలు అందించిన వాలంటీర్లకు, రాష్ట్రస్థాయిలో కళా వైభవం, హస్తకళలలో జిల్లా నుండి పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంస పత్రాలు, జ్ఞాపిక లు అందజేశారు.స్థానిక సంస్థల పాఠశాలల్లో 10వ తరగతిలో లసెట్టి శ్వేత (582), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టాపూర్, జాడి ఆంజనేయ ప్రసాద్ (577), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కలమడుగు, కట్ల సాకేత (577), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టాపూర్ సాధించారని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాలల విభాగంలో ఇంటర్మీడియట్ ఫలితాలలో మెందు అమూల్య (992) ఎం.పి.సి., తెలంగాణ మోడల్ స్కూల్ మంచిర్యాల, కొమ్మల స్వతంత్ర (992) ఎం.పి.సి.,, తెలంగాణ మోడల్ స్కూల్ కాసిపేట, నక్క ఊర్వశి (991) బై.పి.సి., కేజీబీవీ మంచిర్యాల, అలిపి రెడ్డి వైశాలి (966), తెలంగాణ మోడల్ స్కూల్ మంచిర్యాల, పాల్వ స్రవంతి (986), కేజీబీవీతాండూర్, ఎం పి హెచ్ డబ్ల్యు విభాగం సాధించారని తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగంలో గుడిమల్ల శ్రీ వర్షిని, 9వ తరగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆస్నాద్ అండర్ 17వాలీబాల్ లో జాతీయస్థాయి, గాలి పెల్లి అను, 9వ తరగతి,, తెలంగాణ మోడల్ స్కూల్ మందమర్రి, అండర్ 17 ఫుట్ బాల్ జాతీయస్థాయి, కారు విష్ణు 8వ తరగతి, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల బెల్లంపల్లి ,అండర్ 14 సాఫ్ట్ బాల్, జాతీయస్థాయిలో ఫలితాలు సాధించారని తెలిపారు.

## మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**మహా వరంగల్ బ్యూరో ;**వరంగల్ జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం మొక్కజొన్నకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 2400గా ఉండగా, స్థానిక మార్కెట్ ధర సుమారు రూ. 1,900 గా ఉండటంతో రైతులకు ఎంఎస్ పి ద్వారా లాభం చేకూరేలా ప్రభుత్వం కొనుగోళ్లు కొనసాగిస్తోంది.ఇప్పటివరకు 20349 మంది రైతుల నుంచి 1 03 401 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, మొత్తం కొనుగోలు విలువ రూ. 248 కోట్లు విలువతో కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మొక్కజొన్న నిల్వ సమస్యను అధిగమించేందుకు అదనపు గోదాములు, ఓపెన్ కాప్ నిల్వ సదుపాయాలను గుర్తిస్తున్నారు. ప్రారంభంలో 74 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే ఉండగా, గత వారం రోజుల్లో మరో 74 వేల మెట్రిక్ టన్నుల నిల్వ స్థలాన్ని గుర్తించడం జరిగింది.

# వెల్డింగ్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

**ముఖ్య అతిథిగా హాజరైన కంది శ్రీనివాస రెడ్డి .. సమస్యలను పరిష్కరిస్తానని హామీ**



**ఆదిలాబాద్ మహా :** వెల్డింగ్ ఓనర్స్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి తన శాయశక్తుల కృషి చేస్తానని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తిర్పెల్లి డైమండ్ ఫంక్షన్ హాల్లో జమీల్ అధ్యక్షతన జరిగిన వెల్డింగ్ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అసోసియేషన్ సభ్యులు స్థానిక కాంగ్రెస్ నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.అసోసియేషన్ అభివృద్ధి కి ఏ అవసరం వచ్చిన తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు అసోసియేషన్ సభ్యులకు దక్కేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకే సాహిత్య అకాడెమీ అధ్యక్ష పదవి దక్కాలి

మళ్ళీ సాహిత్య రంగంలో సీమాంధ్ర ఆధిపత్యానికి దొడ్డిదారిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించడమే గాకుండా, పాఠశాలల యాజమాన్యాలను, విద్యార్థులను, టీచర్లను కూడగట్టి ఉద్యమ సందర్భంలో ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరించిన సమైక్యవాదికి తెలంగాణ సాహిత్య అకాడెమీ అధ్యక్ష పదవిని కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తున్నదని వార్తలు వస్తున్నాయి. తెలంగాణ అస్తిత్వం, పోరాటం గురించి ఒక్క అక్షరం ముక్క రాయని వారికి అధ్యక్ష పదవిని కట్టబెట్టే ఆలోచన చేయడమంటే అమరుల పోరాట త్యాగ ఫలాలను సమాధి చేయడమే! సమైక్యవాది, తెలుగుదేశం పార్టీ సన్నిహితులకు పదవి అంటే తెలంగాణలోనూ చంద్రబాబు నాయుడు పరోక్ష పాలన సాగుతుంది అనేందుకు ఇంతకన్న నిదర్శనం అక్కర్లేదు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు అవుతున్నా ఆ పోస్ట్ ఇంకా ఎవరికీ కేటాయించలేదు. కాంగ్రెస్ వారెవరికీ సాహిత్యకారుల మీద సరైన అవగాహన లేదు. వారికి సాహిత్యం ప్రాధాన్యత, సాహిత్యకారుల విలువ తెలీదు. దాంతో అదలా వాయిదా పడుతూ వచ్చింది. అర్హులైన వారు ఎందరో ఉన్నా తాత్సారం జరుగుతా ఉంది. ఇదే అదనుగా అనర్హులు ఆ పదవి కోసం పైరవీలు చేస్తున్నారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ వంటి గౌరవప్రదమైన సంస్థకు చైర్మన్‌గా ఎవరు రావాలి అనే చర్చ కేవలం ఒక పదవి గురించి కాదు.. అది తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ చరిత్ర, తెలంగాణ సాహిత్య స్వరానికి, అస్తిత్వానికి సంబంధించిన అంశం.

అకాడెమీ పదవి కోసం తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించినవారు సైతం పోటీ పాడడం సిగ్గుచేటు. ఉదయ్మములో ఎక్కడా కనబడని ఇంకొందరు అవకాశవాదులు సంబంధిత మంత్రి చుట్టూ తిరుగుతూ పైరవీలకు తెరతీసింద్రు.


ఈ స్థితిలో తెలంగాణ కోసం కలంతో పోరాడినవారు, తెలంగాణ భాషను అవమానాల నుంచి కాపాడినవారు, తెలంగాణ చరిత్రను వెలికితీసి ప్రజలకు పరిచయం చేసినవారు, ఉద్యమ సమయంలో తమ రచనలతో ప్రజల్లో చైతన్యం నింపినవారికే అకాడెమీ బాధ్యతలు ఇవ్వాలి. తెలంగాణ సాహిత్య అకాడమీ అనేది కేవలం పరిపాలనా పదవి కాదు; అది తెలంగాణ సాహిత్య ఆత్మను ప్రతిబింబించే వేదిక. ఈ ప్రాంత ఆకాంక్షలు తెలిసి, ఇక్కడి చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, వారసత్వాన్ని గౌరవించే, ఇనుమడింప జేసే వ్యక్తికి దక్కాలి. ఈ ప్రాంత ప్రజలపట్ల అనురక్తి ఉండాలి. అట్లా గాకుండా అనర్హులను అందలమెక్కిస్తే ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వ పరువే గాదు, మొత్తం తెలంగాణ ప్రజల గౌరవానికి భంగం కలుగుతుంది.

పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఆంధ్రాధిపత్యాన్ని పరోక్షంగా స్థాపించాలని చూస్తే ఇక్కడి కవులు, రచయితలు, బుద్ధిజీవులుగా ఈ ప్రభుత్వాన్ని నిస్సందేహంగా నిలదీస్తాం. ఇదే విషయాన్ని మా మాటలు, పాటలు, రచనల ద్వారా ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్తాం అని హెచ్చరిస్తున్నాము. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకొని తెలంగాణ వాదానికి కట్టుబడిన సాహిత్యవేత్తను ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఇప్పటికే తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మ తొలగించి, రాష్ట్ర గీత స్వరకల్పన బాధ్యత ఆంధ్రావారికి అప్పగించి ఈ ప్రాంత సాంస్కృతిక అస్తిత్వ విషయంలో తీరని అన్యాయం చేసింద్రు. ఇప్పుడు యోగ్యుడైన తెలంగాణ వాదిని ఆ పదవికి ఎంపిక చేసినట్లయితే ప్రభుత్వం పరువు కొంతలో కొంత కాపాడుకున్నట్లయితది.

ఒకవేళ ప్రభుత్వం అనర్హులను ఆ పదవికి ఎంపిక చేస్తే తెలంగాణవాదులంతా రవీంద్ర భారతిలో సాహిత్య అకాడమీ ముందు ధర్నా చేస్తామని హెచ్చరిస్తున్నాం.
జై తెలంగాణ!

**- తెలంగాణ సాహిత్యకారులు, ఉద్యమకారులు**

| | |
|---|---|
| జూపాక సుభద్ర | సుంకర రమేష్ |
| అమ్మంగి వేణుగోపాల్ | పగడాల నాగేందర్ |
| అల్లం నారాయణ | గాదె వెంకటేష్ |
| కాసుల ప్రతాప రెడ్డి | బిల్లా మహేందర్ |
| రామచంద్రమౌళి | మన్నే ఏలియా |
| సంగిశెట్టి శ్రీనివాస్ | ఉదారి నారాయణ |
| హనీఫ్ | ఘనపురం దేవేందర్ |
| ప్రసేన్ | సిద్దెంకి యాదగిరి |
| జిలుకర శ్రీనివాస్ | వెల్దండి శ్రీధర్ |
| స్కైబాబ | బైరెడ్డి సతీష్ |
| జగన్ రెడ్డి | ములక సురేష్ |
| పసునూరి రవీందర్ | డా.చింతకింది ఆంజనేయులు |
| గోర్ల బుచ్చన్న | ఎన్ ఎస్ దశరథ్ రామ్ |
| వనపట్ల సుబ్బయ్య | బుక్క సత్యనారాయణ |
| అన్వర్ | తాళ్లూరి రవీంద్ర రావు |
| బైరెడ్డి కృష్ణారెడ్డి | కోట పెంటయ్య |
| కందుకూరి రమేష్ బాబు | కామిశెట్టి శ్రీనివాస్ |
| బాణాల శ్రీనివాస్ | రేల శ్రీను |




## పుస్తక సమీక్షల కోసం...

**తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.**

43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
haneefsd777@gmail.com
whatsapp 9247580946

# పచ్చపచ్చగా మొకం కడిగి బొట్టు పెట్టినట్టున్న కథలు

**సాధారణంగా రచయిత వాస్తవిక జీవితానికి కృత్రిమ సొబగులు అద్ది కళాత్మకంగా కథను చిత్రిస్తాడు. ఆయా పరిస్థితులకు వ్యక్తుల ప్రవర్తనలు, వారి ఆలోచనా విధానాలలో రావలసిన మార్పులను ధ్వన్యాత్మకంగానో, కథలోని వివిధ పాత్రల సంభాషణల్లోనో వ్యక్తం చేస్తుంటాడు. కథలోని ముఖ్యాంశం ఆ రచయిత సమకాలీన సమాజానికి చెందినదే అయి ఉంటుంది. అలా కథను మాధ్యమంగా చేసుకుని, పాఠక హృదయాలను కదిలిస్తుంటాడు. అది కథా రచయిత కలం శక్తి. కథలోని మ్యాజిక్. ఆ కోవలో తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న కథారచయిత పెద్దింటి అశోక్ కుమార్.**


సాహిత్యంలో కథల పతాకగా పాఠక హృదయాలలో ఉన్నతమైన స్థానాన్ని సముపార్జించుకున్నారు పెద్దింటి అశోక్ కుమార్. కథ, నవల, వ్యాసాలు, సినిమాలకు మాటలు,పాటలు ప్రక్రియ ఏదైనా అది పూర్తిగా సామాజికంగా సృజించడం వారి ప్రత్యేకత. ఆ కోవలో 'విత్తనం ' గా రూపు దాల్చాయి వారి మరికొన్ని కథలు.

"రచయితలో ప్రధానంగా మనం చూడవలసింది అతడు స్వానుభవాలను ఎలా ఒంటపట్టించుకుని రూపాంతరాన్ని కల్పిస్తున్నాడన్న దొకటి; భావుకుడుగా పరకీయమైన అనుభవాలను తనవిగా చేసుకుని, వాటి నుంచి ఒకానొక జీవిత తత్త్వాన్ని మథించి మనకు ఎలా ఇవ్వగలుగుతున్నాడన్నదొకటి. ఇలా చూస్తే రచయిత మనసులో, మేథలో ఏ ఒక్క అనుభవమూ అలాగే ఉండిపోదు. స్వయంగా తాననుభవించిన, ఇతరులవి తాను భావించిన అనుభవాలన్నీ కళపెళలాడే అతని హృదయంలో మేథలో సలసల కరిగిపోవాలి; అతడు దర్శించిన జీవిత తత్త్వపు మూసలోకి జారి బిగుసుకుపోవాలి. అంటే రచయిత కేవలం అనుభవాల పుట్ట మాత్రమే కాకుండా ఒక ద్రష్ట అవ్వాలి అన్న మాట" అని మందేశ్వరరావు మాటలను నిరూపిస్తాయి పెద్దింటి అశోక్ కుమార్ రచించే కథలన్నీ. 'విత్తనం' సంపుటిలోని 11 కథలను పరిశీలించినప్పుడు కథలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రచయిత తన హృదయాన్ని కలంతో చిలికి సృజించినట్లుగా తెలుస్తుంది.

'ఎకరం భూమి' నేటి సమాజంలో జరుగుతున్న వాస్తవ ఘటనలకి ఒక కథారూపం. ఈ కథలో చంద్రకళ, బాలయ్య, దేవరాజు ప్రధాన పాత్రలుగా కనిపిస్తారు. చంద్రకళ ప్రేమ కోసం పెళ్లి చేసుకున్న బాలయ్యని కాదనుకుని ఇంట్లోంచి వెళ్లిపోతుంది. ఆమె ప్రేమించిన వ్యక్తికి మేనమామ దేవరాజు. తన అల్లుడికి తన కూతురిని ఇచ్చి పెళ్లి చేయాలనే ఉద్దేశంతో సజావుగా సాగుతున్న చంద్రకళ కాపురంలో చిచ్చు పెడతాడు. చంద్రకళ ప్రేమించిన వ్యక్తికోసం తాళిబంధాన్ని అగౌరవపరిచి వెళ్లిపోవడం తప్పుగా అనిపిస్తుంది. అదే సమయంలో మనసులో వేరొకరిని పెట్టుకుని, తాళి కట్టిన వ్యక్తితో కాపురం చేయలేక పోవడం పరోక్షంగా ప్రేమ పట్ల ఆమె నిజాయితీని ప్రకటిస్తుంది.

ఇక బాలయ్య చంద్రకళ మెడలో తాళి కట్టి, ఆమె వెళ్లిపోయినందుకు బ్రతుకంతా నాశనమైందనుకొని చంద్రకళ మీద కోపంతో ఎవ్వరూ ఇష్టపడని ఇడుపు కాగితాలు రాసే పని చేస్తుంటాడు. చివరికి ఆ చంద్రకళకే ఇడుపు కాగితం రాసే పరిస్థితి వచ్చినప్పటికీ జాలితో ఎకరం భూమి ఆమె పేరు మీద రాయడం ఒక మెరుపయితే, వివిధ పరిణామాల తర్వాత తనతో కలిసి ఉంటానని చెప్పి రెండోసారి మోసం చేసినా కూడా ప్రతీకార వాంఛను మించి ఉన్నతమైన విలువలను చాటిన బాలయ్య వ్యక్తిత్వం కొసమెరుపు. సమాజ ప్రగతికి కులమతాల అడ్డుగోడలు ఈనాటివి కావు. ఈ అడ్డుగోడలు రకరకాల కులాలు, మతాలకు చెందిన ప్రజలు కట్టుకునేవి కావు. వారి మధ్య స్వార్థపరులు, చోద్యం చూసే రాజకీయ కేటుగాళ్లు కట్టేవి. ఎవరి దేవుళ్లను వారు ఎవరి మత సిద్ధాంతాలను వారు గౌరవించుకుంటూ నిలుపుకుంటూ ఒకరితో మరొకరు స్నేహంగా ఉండే ప్రజల మధ్య స్వలాభం కోసం మతం పేరుతో నిప్పు పెట్టి అనవసరమైన కల్లోలాలను రేపుతుంటారు. అలా అనాదిగా హిందూ, ముస్లింల మధ్య కొనసాగుతున్న కైలాటకాలను రాముడు, రహీం ప్రధాన పాత్రలతో అద్దంలో చూపెట్టిన కథ 'దూరం'.

కథల్లో ఎన్నో రకాలు ఉంటాయి. 'ఉల్లి పూసల' కథ చదివితే మనసున్న ప్రతి మనిషికి కళ్ళు విప్పారినట్టుగా అనిపిస్తుంది. పూలమ్మ ఒక్క భాగ్యకే కాదు, ఆడవాళ్ళందరికీ అమ్మయితే బాగుండు అనిపించేలా ఉంటుంది ఈ కథ. సాధారణంగా భర్త చనిపోతే ఆ భార్యను వితంతువుగా మార్చే ప్రక్రియ హృదయ విదారకం.




వికృతం. స్త్రీ తనకు ఉల్లి పూసల నాడే లభించిన బొట్టు, కాటుకలను తానుగా తన ఇష్టానుసారం తీసేయడం ఆమె వ్యక్తిగతమవుతుంది. అంతేకానీ ఆమెకు ఇష్టం ఉన్నా లేకపోయినా బొట్టు, గాజులు మొదలైనవి నిషేధిస్తూ మరొక వితంతువుతో జరిపే ఆ తంతు అనాగరికం. ఆడవాళ్లను వితంతువులను చేసే సన్నివేశం రచయిత కథలో పూలమ్మ పాత్ర ద్వారా దృశ్యీకరించిన తీరు ఆద్యంతం అభ్యుదయ ఆలోచనలకు తెరతీస్తుంది. నవ సమాజ నిర్మాణానికి పాదులు వేస్తుంది.

'టూ గ్రేటర్ దాన్ వన్' టైటిల్ చూడగానే విచిత్రంగా అనిపిస్తుంది. కథ ముగింపులో పర్ఫెక్ట్, సూటబుల్ టైటిల్ అని పాఠకులకు కథలోని విషయాన్ని బట్టి అర్థమవుతుంది. పల్లెటూర్లలో పేదవాళ్ల దీనగాథలు రకరకాలు. 'విక్కీ'అటువంటి కథే. కడుపు నింపుకునేదే ఎక్కువనుకుంటే కట్నం ఇచ్చి ఆడపిల్ల పెళ్లి చేయడం తరతరాల కష్టం? అందునా బాధ్యతలేని తండ్రి. తల్లి తన రెక్కల కష్టంతో సంసారాన్ని ఈదలేక నానా వెతలు పడుతుంటే, కన్న బిడ్డకు కట్నం ఇయ్యలేక అల్లుడితో నానా మాటలు పడుతుంటే చూడలేని ఎదిగీఎదగని వయసు గల కొడుకు ఏం చేస్తాడు? ఇటువంటి జీవితాల ముగింపులు ఎలా ఉంటాయో ఆలోచింపజేసే కథ ఇది. ప్రభుత్వ పాఠశాలలో పెట్టే మధ్యాహ్న భోజనం, గుడ్డు తదితరాలు పేద విద్యార్థులకు కల్పతరువులు. తల్లి ఆరోగ్యం కోసం తనకు పెట్టిన గుడ్డు, స్నేహితురాలిని బతిమిలాడి ఆమె గుడ్డును, ఎన్నో కష్టాలకోర్చి భద్రంగా తెచ్చి అమ్మకు తినిపించే ఓ వెన్నెల కథ 'బాధ్యత'. మన బడుల్లో ఇలాంటి వెన్నెలలు ఎంతోమంది. వారి జీవితాల్లో వెన్నెల పూచేది ఎప్పుడు? ఈ కథ చదివిన ప్రతి పాఠకుడి మనసును తొలిచే ప్రశ్నగా నిలుస్తుంది కథాసారాంశం.

కఠిన పాషాణానికి కూడా గుండె నిండా ఆవేదన, కంటి నిండా నీటిని తెప్పించగలిగే కథ 'ఆరడుగులు'. దాదాపుగా 20182023 వరకు కరోనా వైరస్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. మానవ సంబంధాలను విచ్చినం చేసింది. ఈ సందర్భంగా రచయితలు, కవులు తమకలాలకు పదును పెట్టి సమాజ చైతన్యం కోసం ఉద్యమించారు. ఈ పంథాలో పెద్దింటి అశోక్ కుమార్ రచించిన ' ఆరడుగులు' కథ నాటి కాలపు కథలన్నింటిలోనూ తలమానికంగా నిలిచింది అనడంలో అతిశయోక్తి లేదు. ఆ సమయంలో కన్నోళ్ళనే కనీస జాలి కూడా లేకుండా కసాయితనం ప్రకటించిన పిల్లలు కోకొల్లలు. అటువంటి హృదయ విదారకమైన సంఘటన కథగా దర్శనమిస్తుంది.

బొందయ లాంటి పేదలకు దొరల కింద అణగిమణిగి ఉంటేనే బతుకు సాగేది. సొంత వ్యక్తిత్వం ఉండి అందులోనూ ఎదుటి వారికి సాయపడే తత్వం ఉంటే ఊరు వదిలి పారిపోక తప్పని స్థితి మిగులుతుంది. తెలంగాణ పేదల సాంఘిక దాస్యం వారిపై దొరల పెత్తనం, అజమాయిషీలను చిత్రిక పట్టిన కథ 'విత్తనం'. ఇలా చెప్తూ వెళితే ఏ కథను కూడా విశ్లేషించకుండా వదల బుద్ధి కాదు.

పెద్దింటి అశోక్ కుమార్ కథలు చదివితే పుట్టెడు సమస్యలతో ఉన్న మనిషికి మనసంతా నిండినట్లు అనిపిస్తుంది. ప్రజల భాషనే కథాభాషగా ఎంచుకోవడం వల్ల రచయిత ప్రజలకు దగ్గరవుతూ వారి జీవన పరిస్థితుల్ని మెరుగుపరచడానికి కావలసిన చైతన్యాన్ని అందిస్తాడు. తార్కిక ఆలోచనలను మొలకెత్తిస్తూ ఏకబిగిన పుస్తకమంతా చదివిస్తాడు.

ప్రత్యేకించి 'విత్తనం ' లోని ఏ కథ చదివినా అందులో తెలంగాణ సమాజమే కనిపిస్తుంది. పల్లె జీవితాలు, కులమత విద్వేషాలు, మూఢాచారాలు, పేదల బతుకు చిత్రాలు, కాలానుగుణంగా వచ్చే సహజ విపత్తులు, అపహాస్యం పాలవుతున్న ప్రజాస్వామ్యం, నాటి నుండి నేటి వరకు వివిధరూపాల్లో కొనసాగుతున్న దొరల దోపిడీలు, రైతుల కష్టాలు మొదలగు ఎన్నో సమకాలీన అంశాలు కథల్లో పరుచుకుని ఉంటాయి. భాషాపరంగా, వస్తు పరంగా పెద్దింటి కథలది ఒక సరికొత్త శైలి. రచయిత ఎంపిక చేసుకున్న ప్రతి కథా వస్తువు ప్రగతిశీలమైనది. అచ్చమైన పదహారణాల తెలంగాణ ప్రజాజీవిత కథలు ఇవి. 'మాభూమి ' వంటి తెలంగాణ సినిమాను చూసినట్లుగా ఒక్కో కథ సినిమాటిక్ గా అనిపించేలా రచయిత కథనం సాగుతుంది. అందుకే ప్రజలు ఈ కథలను తమవిగా భావిస్తారు.

సామాజికంగానే కాక సాంస్కృతికంగానూ పెద్దింటి కథలు ఎంతో ఎత్తులో కనిపిస్తాయి. "ఇడుపు కాయిదం మునిమాపున ఊరివుతలనే రాయాలె""ఇచ్చినా తీసుకున్నా ఆడపిల్లనే బాధ పడేది" .. అన్న రచయిత మాటల్లో భార్యాభర్తల బంధం తెగిపోతున్న సందర్భాన్ని ఒక అశుభకార్యంగా భావిస్తూ మునిమాపున ఊరివుతలనే




రాయాలని ప్రస్తావించడంలో భార్యాభర్తలను విడదీయడమనేది పాపపు పనిగా భావించే మన భారతీయ సాంస్కృతిక ప్రత్యేకత కనిపిస్తుంది. అంతేకాకుండా విడాకులు ఇచ్చినా తీసుకున్నా ప్రాథమికంగా బాధపడేది, సమస్యలను ఎదుర్కొనేది ఎక్కువ శాతం మహిళలే. "అరటాకు మీద ముళ్ళు పడ్డా, ముల్లు మీద అరటాకు పడ్డా, అరిటాకుకే నష్టం" అనే పాత సామెత ఇక్కడ గుర్తుకొస్తుంది. అలాగే ఊరు గురించి చెప్పేటప్పుడు "పచ్చ పచ్చగా మొకం కడిగి బొట్టు పెట్టినట్టుంది అంటాడు

w" తొమ్మిదొద్దులనాడు సంటి పిల్లలకు ఉల్లి పూసల పండుగ చేసి లింగాలకు పెట్టింది. బొడ్డు తాడును కాల్చి, బొట్టు పెట్టి జిట్టి పూసలు గట్టింది. ' ఎల్లెనుకా బుడుబుడుకా... ఎల్లితే నీతో ఎవలురుకా... పామోలె పాకులాడు కప్పోలె ఆటలాడు కోకిలోలె పాటవాడు.. నిండు నూరేండ్లు బతుకు...ఎల్లెనుకా బుడుబుడుకా' అని రచయిత చెప్పిన తీరులో తెలంగాణ పురిటి పండుగ కళ్ళ ముందు కదలాడుతుంది. ఇలా అన్ని కథల్లోనూ తెలంగాణ సంస్కృతిని సహజంగా ప్రతిబింబిస్తాడు. సందర్భానుసారంగా అందమైన వర్ణనలను రుచి చూపిస్తాడు.

ఒక రచయితకి సాహిత్య రచనలు సామాజిక ఆచరణలైనప్పుడు ఆ రచయిత ప్రజా రచయితవుతాడు. వృత్తిపరంగా ఉపాధ్యాయుడైన పెద్దింటి అశోక్ కుమార్ బడి కేంద్రంగా కొత్త కొత్త ప్రయోగాలు ఎన్నో చేశాడు. తన పనితీరు మీద తానే రెఫరండం పెట్టుకున్న చరిత్ర ఆయనకే సొంతం. సాహిత్యపరంగా కథాశిఖరం మీద తన స్థానం పదిలం చేసుకున్నాడు. సినిమాలకు కథలు, మాటలు, పాటలు అందిస్తూ సాగుతున్న పెద్దింటి అశోక్ కుమార్ అచ్చమైన తెలంగాణ కథల పచ్చని సంతకం.



**- డా. ఉప్పల పద్మ**
9959126682

## ప్రయాణం ఒక ప్రవాహమే

ప్రయాణం అంటే ప్రవాహంలా
సాగిపోవడమే
వాగులానో, వంకలానో
నదిలానో, హిమానీ నదంలానో
సాగిపోవడమే దాని గుణం
కావాలి
ప్రయాణంలో మజిలీలు
ఉంటాయి
ఇతిహాసాల్లో పర్వాలుగానో, కా
వ్యాల్లో ఖండికలుగానో...
ప్రయాణంలో జీవితం ఇతిహా
సంగానో, కావ్యంగానో నిలిచి
పోవాలి
నలుగురి నాలుక మీద ఓ పద్యం
గానో, గుర్తుండి పోయే ఓ వా
క్యంగానో మిగిలిపోవాలి
షడ్జమ స్వరంలో నెమలి
నాట్యంలా జీవనోత్సాహంలా
పరిమళించాలి
జీవితమంటేనే ప్రయాణం,
ప్రయాణమంటేనే జీవితం
ప్రయాణం జీవలక్షణం కావాలి
ప్రయాణంలో దూరాలు కొనసా
గుతూ వుంటే ఆశ్చర్యపోనక్క
ర్లేదు !!
ఈ ప్రస్థానంలో కొన్ని గొప్ప సం
ఘటనలు జరగవచ్చు లేదా
ఎదురు కావచ్చు
ప్రయాణం ఒకరి కోసమే
కాకూడదు,
కొమ్మలాంటి దారి మీద
ప్రయాణం ఆకుపచ్చని ద్రవమై
ప్రవహించాలి
చెట్టు నీడై గొడుగు పట్టాలి



**డా . రూప్ కుమార్ డబ్బీకార్,**
91778 57389

## సంగం కాలపు మరో ప్రేమపద్యం

నీలవెన్నెలలో నువ్వు పలికిన
మాటలు
నదిచారల్లో విరిసే తెల్ల జలపు
ష్పాల్లా
నా హృదయాన్నంతా మత్తెక్కిం
చాయి.

నువ్వు దగ్గరగా వచ్చిన ప్రతి
క్షణం
అలల మధురమంతా నా
లోపల చేరి
సాగే నది కూడా నెమ్మదై నిశ్శ
బ్దంగా వినింది.

నీ చూపుల పొంగులో
సూర్యాస్తమయం తన
రంగులను
కాస్తంత విడిచి ఉంచింది——
అది నా మనసులో చేరే నీ ప్రతి
బింబానికి
చోటుచేసుకోవడానికే.

పొద్దున్న గాలిలో
నువ్వు పలికిన ఒక్క శ్వాస
పొర్లే ప్రవాహం లాగా
నా ప్రతి నిట్టూర్పాన్నీ కరిగించి
సంతోషం అనే తీరం వైపు
నడిపింది.

ప్రేమంటే——
అరచేతిలో నీళ్లు జారిపోతూ
చివరికి గుండెల్లో నిలిచే
ఒక సున్నితమైన యాత్ర.

నువ్వు నా పక్కన ఉన్నావంటే
ఈ నది ఎంత దూరమైనా పార
గలదు;
నీవే లేకపోతే
ఒక అల కూడా ముందుకు
కదలదు.

నీ ప్రేమ——
నా నడకకు ప్రవాహం,
నా శ్వాసకు తీరం,
నా అంతరంగానికే శాశ్వత
సంగీతం.

డాక్టర్ పెరుగు రామకృష్ణ
9849230443


## మహాశాంతి

యుద్ధాల్ని క్షమించ వద్దు
మాటల బ్లేడుతో
మాటిమాటికి
పరిస్థితుల్ని చెక్కుతూ
లేలేత రక్తాక్షరాలు
లిఖిస్తున్న యుద్ధాన్ని
యుద్ధ హంతకులను
యుద్ధ వ్యాపారులను
ఎవరినీ.. ఎవరినీ
క్షమించ వద్దు.

చిగుళ్లు తొడిగే కాలంలో
ఎండుటాకులుగా
చిగుళ్లను రాల్చిన యుద్ధ ఋతువును
కాలం కాపీనుంచి పరపరా చింపేసి ఉండగా
చుట్టి భూగోళం
బయటికి విసిరికొట్టాలి.

మహాహంకారం
ధర్మ సంస్థాపనావతారం
మాస్కును తగిలించుకుని
యావత్ప్రపంచం
హాహాకారంతో హడలి పోయేలా
చేస్తున్న వేళ
నిమ్మకు నీరెత్తిన దేశాలు కాదు
కొమ్ములు విరిచే
మహా ఆవేశాలు కావాలిప్పుడు.
మహాశాంతి నెలకొనాలిప్పుడు.

హోర్ముజ్
జలసంధి దిగ్బంధనం కాదు
ప్రపంచం పీక నులుముతూ
శ్వాస ప్రయాణాన్ని
నియంత్రిస్తున్న
వాడి చేతల్ని చేతుల్ని
ఖండించే
ఖడ్గసృష్టి జరగాలిప్పుడు.



**- మడిపల్లి రాజ్ కుమార్**
9949699215

## "అనే నేను :

ఏ కాలానికి మనం "అనే నేను"
అనగలం !
ఎందరికి ఉపకారం చేసాం !
ఎందరి కన్నీటినీ తుడిచాం !

జాగరణ చేసి మంచం పైని తల్లితండ్రుల
కు సేవ చేసి వారికి మరణయాతన
తప్పించామా !
అనే నేను అనే అర్హత రావడం ఎన్నో
త్యాగాల తరువాత కదా !

నీ పేరుకు ముందు అనే నేను
విశ్వ ప్రతిధ్వని !



**- కందాళై రాఘవాచార్య**
8790593638

## గాలిదుమారం హైకూలు

రాత్రొచ్చిన గాలిదుమారం
పొద్దున్నే నేలకు
మొరపెట్టుకుంటూ చెట్లు
★
వాన వెలిసింది
గతుకుల రోడ్డును చూసి
వానవిల్లు గుండె ముక్కలు
★
నీటిపడెలో
రంగుల వంతెన కూలింది
పిల్లాడి కాలు పడి
★
ఎక్కడెక్కడి చెత్తో
ఇక్కడికి తెచ్చి పడేసింది
గాలిదుమారం
★
గాలిదుమారం
ఇల్లు రోడ్డున పడింది
పైకప్పు లేచిపోయి

**- చిత్తలూరి**
9133832246

## రైలు కిందపడి కానిస్టేబుల్ ఆత్మహత్య

**మందమర్రి, మహా;** మందమర్రి మున్సిపాలిటీ పరిధి ఎర్రగుంట పల్లెకు చెందిన కానిస్టేబుల్ అరవింద్ యాదవ్ ఉదయం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మందమర్రి పట్టణం రామన్ కాలనీ మూడవ రైల్ ట్రాక్ పై కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని కథనం. సమాచారాన్ని అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అతని మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియ రాలేదు.

## లబ్ధిదారునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**బూర్గంపహాడ్ మహా :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన బండారు శ్రీనివాస్‌కు రూ.60,000 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజలకు అత్యవసర సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో ఉపశమనం కలుగుతోందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను వెల్లడించాలి

### సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**గడిచిన ఆర్థిక సంవత్సరంలో వచ్చిన వాస్తవ లాభాలను సింగరేణి యాజమాన్యం వెంటనే ప్రకటించాలని సింగరేణి సంస్థకు జెన్కో నుండి రావాల్సిన 53 వేల కోట్లు బకాయిలు వెంటనే వసూలు చేసి సంస్థకు నూతన ప్రాజెక్టులను తీసుకొచ్చి సంస్థ మనుగడను కాపాడాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెం శేషగిరిభవన్ లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని సింగరేణి కార్మికులు ఎదుర్కుంటున్న పలు సమస్యలపై ఇటీవల డైరెక్టర్(పా)తో జరిగిన చర్చల వివరాలను నాయకులకు వెల్లడించారు. సింగరేణి గనుల్లో ఉత్పత్తి టార్గెట్ కోసం కార్మికుల పై ఒత్తిడికి జీవోల జారీనీ మానుకోవాలని కనీస సౌకర్యాలు కొత్త యంత్రాలు లేకుండా ఉత్పత్తిపై ఒత్తిడికి మల్టీ డిసిప్లినరీ కమిటీలు సరైన పద్ధతి కాదన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం లాభాల వాటా ప్రకటించకుండా యాజమాన్యం మభ్య పెడుతుందని మండిపడ్డారు. అదేవిధంగా మెడికల్ బోర్డ్ పై చర్చల్లో యాజమాన్యం ఒప్పుకున్న విధంగా పాత పద్ధతిలో మెడికల్ బోర్డ్ ఏర్పాటు చెయ్యాలని కోరారు. పాత గనులు మూతబడుతున్నాయని ఓబీలను సింగరేణి టేక్ ఓవర్ చేసుకొని సంస్థ మనుగడను కాపాడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో సింగరేణి ప్రాజెక్ట్ లపై శ్వేత పత్రం విడుదల చెయ్యాలని యాజమాన్యాన్ని కోరారు. అధికార పార్టీ అనుబంధ ఐ ఎన్ టి యు సి తప్పుడు ప్రచారాలతో కార్మికులను మభ్యబెడుతున్నారని అదేవిధంగా కేంద్రం నూతన లేబర్ కోడ్ లను సింగరేణిలో వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మల్లీ డిపార్ట్మెంట్ మీటింగ్ లో పనిగంటలు పెంపు చేసి కార్మికుల మీద పని భారం మోపడం కాదన్నారు. ముందు మ్యాన్ పవర్ పెంచి పాత యంత్రాల స్థానంలో కొత్త యంత్రాలను సమకూర్చాలని అన్నారు. ఐ ఎన్ టీ యు సి నాయకులు కాంగ్రెస్ మంత్రుల వద్ద ఫోటోలకు పోజులు ఇస్తూ ఉత్తిమాటలు చెప్తూ మభ్యపెట్టుడు సరైంది కాదన్నారు. అధికార పార్టీగా ఉన్న మీరు సింగరేణికి జెన్కోల నుండి రావాల్సిన 53 వేల కోట్లు బకాయిలు వసూలు చేయాలని సవాల్ విసిరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి నిరంతరం పోరాటం చేస్తుందని యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తూ సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తుందని ఈ విషయాన్ని కార్మికులు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, పిట్ కార్యదర్శులు మధు కృష్ణ, కమల్, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుల్లో రాణించాలి

- మేయర్ మూడు గణేష్
- విద్యా వారోత్సవాలు విజయవంతం




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** విద్యార్థులు చదువుల్లో రాణించాలని కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ అన్నారు. వారం రోజులపాటు కొనసాగిన విద్యా వారోత్సవాలు ఆదివారంతో విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా కొత్తగూడెంలోని జిల్లా విద్యాశిక్షణా కేంద్రంలో నిర్వహించిన విద్యా విజయోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మేయర్ మూడు గణేష్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న ప్రతిభాపాటవాలను వెలికితీస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంపే లక్ష్యంగా ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపట్టి జిల్లా విద్యాశాఖను ముందంజలో ఉంచడానికి నిరంతరం శ్రమ పడుతున్నామని దీనికి మండల విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులు తగు సహకారాన్ని అందిస్తున్నారని అభినందనలు తెలిపారు. దీనిలో భాగంగా తల్లిదండ్రులందరూ కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను నాణ్యమైన విద్యను గుర్తించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా పదవ తరగతిలో జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాలు సాధించిన మద్దాల ప్రవీణ్, మేక మన్విత, సిహెచ్.రేణుక లక్ష్మీమణిలకు, అదేవిధంగా ఇంటర్మీడియట్లో జిల్లా స్థాయి మొదటి మూడు స్థానాలు సాధించిన సంజన, ఆర్.సంజన, బి.నీలిమలతో పాటు క్రీడలలో ప్రతిభ కనపరిచిన ఏ.యశ్వంత్, వంగూరి వినయ్ వర్మ, మహమ్మద్ ఆసిఫ్ లను ఒక్కొక్కరిని పదివేల రూపాయల నగదు బహుమతితో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.శంభు ప్రసాద్, జిల్లా ప్రభుత్వ పరీక్షల కార్యదర్శి ఎస్.మాధవరావు, జిల్లా సైన్స్ అధికారి బి.సంపత్ కుమార్, బాలిక విద్య కోఆర్డినేటర్ జే.అన్నామని, క్రీడల కార్యదర్శి వీ.నరేష్ కుమార్, జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎన్నో ఏళ్ల కల నెరవేరిన వేళ

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సహకారంతో సమస్యకు పరిష్కారం
- సర్పంచ్ తాటి వాణి



**బూర్గంపహాడ్ మహా :**ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు ప్రారంభించడం ఆనందంగా ఉందని కృష్ణసాగర్ సర్పంచ్ తాటి వాణి అన్నారు. బూర్గంపహాడ్ మండలం కృష్ణసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కృష్ణసాగర్ ఎస్సీ కాలనీలో ఆదివారం నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఉప సర్పంచ్ బి. మోహన్ రావు తో కలిపి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "ఎస్సీ కాలనీ వాసులు ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో బురదమయమై రాకపోకలకు నానా అవస్థలు పడేవారు. వారి కష్టాలను చూసి చలించిపోయి, పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లాను. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఈ సీసీ రోడ్డును మంజూరు చేయించారు" అని తెలిపారు. రోడ్డు మంజూరు చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి ఈ సందర్భంగా కాలనీవాసుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు అంతోటి కృష్ణ లీల, ఉసిల్ల రాజేష్, పిఎసిఎస్ డైరెక్టర్ ఉండేటి గోవర్ధన్, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా కార్యదర్శి బోడ దివ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. నాగిరెడ్డి, గ్రామ పెద్దలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన రోడ్డు రావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.




G.THANMAI SRI 25205 (A & P) | Y.VINEETHA 18534 (A & P) | P.NAGA JYOTHI 26693 (A & P) | B.A.V.S MANIKANTA 24278 (Engg) | P.CHANDRA SHEKAR 22110 (Engg) | N.V S GANESH 27854 (Engg)

## ఎప్ సెట్ ఫలితాలలో బ్రిలియంట్ విద్యార్థుల విజయకేతనం

**బూర్గంపహాడ్ మహా :** స్థానిక సారపాక బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు నేడు ప్రకటించిన తెలంగాణ ఎప్ సెట్ (EAPCET) ఫలితాలలో మరొకసారి విజయకేతనం ఎగర వేశారు. ఇంజనీరింగ్ విభాగంలో పి. జయంత్ రెడ్డి 1498 వ ర్యాంకు, పి.చంద్ర శేఖర్ 22110 వ ర్యాంకు, బి.ఏ.వీ.ఎస్.మణికంఠ 24278 వ ర్యాంకు, ఎన్.వీ.ఎస్ గణేష్ 27854 వ ర్యాంకులు సాధించగా అగ్రికల్చర్ విభాగంలో వై.వినీత 18534 వ ర్యాంకు , జి.తణ్మయి శ్రీ 25205 ర్యాంకు, పి.నాగజ్యోతి 26693 ర్యాంకులతో ముందంజలో నిలిచి బ్రిలియంట్ విద్యార్థులు మరొకసారి సారపాక కీర్తి కిరీటాన్ని రాష్ట్రస్థాయిలో నిలిపారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ డా॥ బి ఎన్ ఆర్ మాట్లాడుతూ గ్రామీణ ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు బ్రిలియంట్ కాలేజ్ నందు ఎప్ సెట్ కోచింగ్ తీసుకుని 99% ఉత్తీర్ణత సాధించినందుకు మాకు ఎంతో ఆనందంగా ఉంది అన్నారు. ఈ ఎప్ సెట్ ఫలితాలలో మొదటి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు డా॥ బి ఎన్ ఆర్ మెమెంటో ఇచ్చి అభినందనలు తెలియజేశారు. మంచి ఫలితాలను సాధించేందుకు సహకరించిన తల్లిదండ్రులకు, అధ్యాపకులకు ఈ సందర్భంగా డా.బియన్ఆర్ ధన్యవాదములు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్ డా. బిఎన్ఆర్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పినపాక పట్టి నగర్‌లో తీవ్ర మంచినీటి ఎద్దడి


### మండుటెండలో చేతిపంపుల వద్ద బారులు తీరుతున్న ప్రజలు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం పెనుపాక పట్టి నగర్ గ్రామంలో తీవ్ర మంచినీటి సమస్య నెలకొంది. ఎండలు మండిపోతున్న వేళ గ్రామ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని చేతిపంపుల వద్ద మహిళలు, వృద్ధులు, చిన్నారులు గంటల తరబడి బారులు తీరుతూ నీటి కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామానికి సమీపంలో కిన్నెరసాని నది ప్రవహిస్తున్నప్పటికీ, గ్రామ ప్రజలకు తాగునీరు అందకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "తలాపున నీళ్లు ఉన్నా చేప తల్లడిల్లినట్లు" తమ పరిస్థితి మారిందని గ్రామస్తులు వాపోతున్నారు.మంచినీటి సమస్యపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. పాలకవర్గం మరియు సంబంధిత అధికారులు గ్రామ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇక సమస్య పరిష్కారానికి స్పందన లేకపోవడంతో పెనుపాక పట్టి నగర్ గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట బిందెలతో ధర్నాకు సిద్ధమవుతున్నారు. తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించి గ్రామానికి సరిపడా మంచినీటి సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో పెరుగుతున్న నీటి ఎద్దడి సమస్యపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సత్యనారాయణపురం PHCకు 108 అంబులెన్స్ ను తిరిగి కేటాయించాలి

### భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠకు గ్రామస్థుల వినతి



**చర్ల మహా :** చర్ల మండలంలోని సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC) నుండి చర్ల PHCకు తరలించిన 108 అంబులెన్స్ సేవలను తిరిగి సత్యనారాయణపురం PHCకు కేటాయించాలని గ్రామస్థులు భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ను కోరారు.ఆదివారం సత్యనారాయణపురం రైతు వేదికలో నిర్వహించిన సీతారామ ప్రాజెక్ట్ భూనిర్వాసిత రైతుల సమావేశం సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు ఆధ్వర్యంలో గ్రామస్థులు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా దానవాయిపేటకు చెందిన రూంజా రాజా మాట్లాడుతూ, సత్యనారాయణపురం PHC పరిధిలో అనేక ఏజెన్సీ గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం 108 అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీలు, వృద్ధులు, ప్రమాద బాధితులను ఆసుపత్రులకు తరలించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని వెంటనే 108 అంబులెన్స్‌ను తిరిగి సత్యనారాయణపురం PHCకు కేటాయించాలని గ్రామస్థులు సబ్ కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, ఇందల రమేష్, నానిబాబు, రూంజా రాజా, అల్లి ఉమామహేష్, సాంబయ్య, ప్రవీణ్, సురేష్, ఆర్. కొత్తగూడెం,

# పొదుపు సూత్రాలు ప్రజలకేనా ప్రధాన మంత్రికి వర్తించవా..?

- పెట్రోల్ డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపై ప్రభావం
- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు
- ధరల పెంపును వ్యతిరేకిస్తూ సిపిఎం నిరసన




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**ప్రధానమంత్రి మోడీది స్వదేశీ నినాదం విదేశీ వ్యామోహం అని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను నిరసిస్తూ ఆటోకి తాడు కట్టి లాగుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడీ తాను వేసుకునే కోర్టు తాగే నీళ్లు చేతులు పెట్టుకునే వాచి విదేశీ వాడుతూ ప్రజలకు మాత్రం స్వదేశీ నినాదం ఇస్తున్నారని మోడీ స్వదేశీ నినాదం పొదుపు సూత్రాలు సామాన్య ప్రజలకేనా ఆయనకు వర్తించవా అని ప్రశ్నించారు. ప్రధాన మంత్రి చెబుతున్న పొదుపుమంత్రంలో దేశాభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రభావం ప్రజలపై నేరుగా పడుతుందనీ గ్యాస్ ధరల పెంపుతో ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్యాస్ ధరలను రెండు దఫాలుగా పెంచిందని విమర్శించారు. ఈ ధరల పెంపు దేశ ఆర్థిక వ్యవస్థపైనా సామాన్య ప్రజానీకంపైనా తీవ్ర భారాన్ని మోపుతుందని తెలిపారు. ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ మధ్య యుద్ధం జరుగుతున్నది కాబట్టి పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధాని మోడీ చూపడం విడ్డూరంగా ఉందన్నారు. తాము అప్పుడే చెప్పామనీ పొదుపుమంత్రం చెప్పి పొదుపు పాటించట్లేదు కాదు కాబట్టి ధరలు పెంచుతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నేరం చేసేవాడు ఒకడైతే ప్రజలకు శిక్ష వేసే పరిస్థితి నేడు నెలకొందని తెలిపారు. అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం ఆగితే ఈ ధరలు పెంచాల్సిన అవసరం ఉండదన్నారు. అయితే ప్రధాన మంత్రి మోడీ యుద్ధ నివారణ చర్యలు తీసుకోకుండా అమెరికాకు దాసోహం అయిపోయి ట్రంప్‌కు సాష్టాంగ నమస్కారం చేస్తూ ప్రజలు మాత్రం ధరల భారాలను భరించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అంతకుముందు పొదుపు చర్యలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. యూరియాను మానేయండి విదేశీ ప్రయాణాలు ఆపండి బంగారం కొనకండి ఆఫీసులకు వెళ్లకుండా వర్క్‌ఫ్రమ్ హోం చేయండి అనటం సరిగాదనీ అవన్నీ చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ ఏం కావాలని ప్రశ్నించారు. ఉత్పత్తి దెబ్బతిన్న తర్వాత దేశ అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. యుద్ధం చేస్తున్న వారికి మద్దతిచ్చేలా మోడీ విదేశీ పర్యటనలు ఉంటున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ లిక్కి బాలరాజు రేపాకుల శ్రీనివాస్ జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ నాయకులు నందిపాటి రమేష్ నాగకృష్ణ సతీష్ బాలకృష్ణ రాములు సలీం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్పీ చర్ల మండల అధ్యక్షుడిగా పాయల మోహన్ రావు నియామకం

### సింగసముద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం



**చర్ల మహా :** చర్ల మండలం సింగసముద్రం గ్రామంలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి భద్రాచలం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మరియు చర్ల మండల ఇన్‌చార్జ్ చెన్నం మోహన్ రావు అధ్యక్షత వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా యాసం సిద్దార్థ పూలే మరియు కొప్పుల నారాయణ హాజరయ్యారు.ఈ సందర్భంగా చర్ల మండల బీఎస్పీ కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా పాయల మోహన్‌రావును నియమించగా, ఉపాధ్యక్షుడిగా ధ్రువ నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా చాపా భాస్కర్ రావు, కార్యదర్శిగా కాకా నర్సయ్య, కోశాధికారిగా పర్సిక చిన్నబ్బిని నియమించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు యాసం సిద్దార్థ పూలే మాట్లాడుతూ, చర్ల మండలంలోని ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో సెక్టార్ కమిటీలు, బూత్ కమిటీలు ఏర్పాటు చేసి రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.అలాగే బహుజన్ సమాజ్ పార్టీ సిద్ధాంతాలపై క్యాడర్ క్యాంపులు నిర్వహించేందుకు నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తడికల శివకుమార్, బొగ్గుల శ్రీరాములు, సోయం శ్రీమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు కాళ్లు కోల్పోయిన మడకం హిడ్మాను ఆదుకోవాలి


### మానవత్వంతో ముందుకు రావాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పిలుపు




**చర్ల మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బక్క చింతల పాడు గ్రామానికి చెందిన మడకం హిడ్మా విద్యుత్ షాక్ ప్రమాదంలో రెండు కాళ్లు పూర్తిగా కోల్పోయి, ఎడమ చేయి కూడా పనిచేయని దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నాడని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ మాట్లాడుతూ, గత ఆరు సంవత్సరాలుగా మడకం హిడ్మా తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో కుటుంబంతో కలిసి ఎన్నో కష్టాలు పడుతున్నాడన్నారు.హిడ్మా భార్య మడకం సుశీల కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నప్పటికీ, కుటుంబ ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని తెలిపారు. బాధిత కుటుంబం పలుమార్లు చర్ల ఎంపీడీవోతో పాటు సంబంధిత అధికారులకు వినతులు అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి సహాయం అందలేదని ఆరోపించారు.విద్యుత్ షాక్ ప్రమాదాలకు గురైన వారికి చట్టప్రకారం ప్రభుత్వం నష్టపరిహారం అందించాల్సి ఉన్నప్పటికీ, హిడ్మాకు ఇప్పటివరకు ఎటువంటి పరిహారం అందలేదని పేర్కొన్నారు. పూర్తిగా వికలాంగుడైన హిడ్మా కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు, మూడు చక్రాల స్కూటీ వాహనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే దాతలు, సేవా సంస్థలు ముందుకు వచ్చి మడకం హిడ్మాకు కృత్రిమ కాళ్లు అమర్చేందుకు సహకరించాలని, కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు విజ్ఞప్తి చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాద బాధితుల పట్ల ప్రభుత్వం, అధికారులు మరింత మానవత్వంతో స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

# మాతృమూర్తి మట్టా ఆరోగ్యమ్మ జన్మదిన వేడుకలు

### వేడుకల్లో మాతృమూర్తికి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్




**సత్తుపల్లి, మహా:** సమాజ సేవకురాలు, మాతృమూర్తి మట్టా ఆరోగ్యమ్మ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్, నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తమ నివాసంలో అట్టహాసంగా ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో భాగంగా తనయుడు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్ మాతృమూర్తి మట్టా ఆరోగ్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్ మాట్లాడుతూ అమ్మ నేర్పిన ప్రజా సేవకు అంకితమై అహర్నిశలు శ్రమించడం వలనే సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు తమ కుటుంబానికి ప్రజా క్షేత్రంలో తిరుగులేని విజయం అందించారని గుర్తు చేసుకున్నారు. ప్రజా అభిమానంతో అధికారం పొందే సమయానికి అమ్మ తమతో లేదని భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహానా కమల్ పాషా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మట్టా సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సాయం అందించిన ఎమ్మెల్యే పాయం..

### సీఎంఆర్ఎఫ్ చెక్కు, రూ.5 లక్షల ఎల్ ఓసి పంపిణీ..

**మణుగూరు, మహా :** పినపాక నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, ఎల్‌వోసీలను అందజేశారు. బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన బండారు శ్రీనివాస్‌కు రూ.60 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. అలాగే మునుగోడు చందర్రావు అక్కకు వైద్య చికిత్సల నిమిత్తం రూ.5 లక్షల విలువైన ఎల్ ఓ సిను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయని తెలిపారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



విప్పల సింగారం అభివృద్ధికై

# ఎమ్మెల్యే పాయంకు వినతి..

మణికంఠ నగర్‌లో రూ.కోటి బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం విప్పల సింగారం గ్రామపంచాయతీ పరిధిలో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ గ్రామ సర్పంచ్ పాల్వంచ రాములు, ఉపసర్పంచ్ గోరంట్ల కనకయ్యలు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఆదివారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన వారు, గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. వినతి పత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గ్రామ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా సర్పంచ్ రాములు విలేకరులకు తెలిపారు.

**మణికంఠ నగర్‌లో బిటి రోడ్డు పనులు ప్రారంభం..**

మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని మణికంఠ నగర్‌లో సుమారు రూ.కోటి నిధులతో చేపడుతున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆదివారం ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, 14వ వార్డు సభ్యులు వాంకుడోత్ నాగేంద్రబాబు, 5వ వార్డు సభ్యులు కోలపిన్ని మానస, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ దొబ్బల వెంకటప్పయ్యలు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషితోనే మణికంఠ నగర్‌కు రూ.కోటి నిధులు మంజూరై బిటి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏఎం చారీ, ఎండీ యాకూబ్ అలీ, బొజ్జా త్రిమూర్తులు, రాజేష్, పల్లపు తిరుమలేష్‌తో పాటు స్థానిక ప్రజలు కొమరం సురేష్, వజ్జా శ్రీకాంత్, కోటేశ్వరరావు, కృష్ణంరాజు, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. మణికంఠ నగర్ ప్రజలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఉద్యమకారుల పోరాటానికే ఫలితం: కేకే కమిటీ

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం



**కుషాయిగూడ, మహా :** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, ఆత్మగౌరవం కోసం తొమ్మిదేళ్లుగా సాగించిన ఉద్యమాల ఫలితంగానే ప్రభుత్వం కేకే కమిటీని ఏర్పాటు చేసిందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఫౌండర్ ఛైర్మన్ డా. చీమ శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర సాధన తర్వాత ఉద్యమకారులను రాజకీయ పార్టీలు పూర్తిగా విస్మరించిన సమయంలో పిడికెడు మందితో ఫోరంను ఏర్పాటు చేసి ఉద్యమకారులను ఐక్యం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా చైతన్యం తీసుకొచ్చామని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం 33 జిల్లాల్లో సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలు, ధర్నాలు, పాదయాత్రలు, పోస్టుకార్డు ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందన రాలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యమకారుల సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకొని అన్ని రాజకీయ పార్టీలను కలిసినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమకారుల కోసం 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ హామీలు చేర్చడంలో ఫోరం పాత్ర ఉందన్నారు.హరిహర కళాభవన్‌లో నిర్వహించిన భారీ సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అనంతరం ప్రభుత్వం వద్ద నిరంతరం ఒత్తిడి తీసుకురావడంతో కేకే కమిటీ ఏర్పాటుకు మార్గం సుగమమైందన్నారు. కమిటీ ద్వారా నిజమైన ఉద్యమకారులను గుర్తించి సంక్షేమ ఫలాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం, తెలంగాణ పునర్నిర్మాణమే ఫోరం లక్ష్యమని డా. చీమ శ్రీనివాస్ స్పష్టం చేశారు.



## భద్రాచలంలో యువకుడు అదృశ్యం

- పెళ్లి విషయం ప్రస్తావించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడు
- ఆచూకీ తెలిపిన వారికి పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి

**భద్రాచలం మహా :** భద్రాచలం పట్టణానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. రెవెన్యూ కాలనీకి చెందిన డికొండ సాయి మణికుమార్ (29) అనే యువకుడు గత కొన్ని రోజులుగా కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, డికొండ సాయి మణికుమార్ బీటెక్ పూర్తి చేసి గత కొంతకాలంగా చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించాడు. ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తేదీ 12052026 రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఇంట్లో పెళ్లి విషయంపై తల్లిదండ్రులు మాట్లాడగా, పెళ్లి చేసుకోవడం ఇష్టం లేకపోవడంతో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.యువకుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు భద్రాచలం పట్టణమంతా వెతికినా ఎటువంటి సమాచారం లభించలేదు. దీంతో యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.ఈ ఘటనపై భద్రాచలం సబ్ ఇన్‌స్పెక్టర్ జి. స్వప్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అదృశ్యమైన యువకుడు ఎవరైనా కనిపించినా లేదా అతని ఆచూకీ తెలిసినా వెంటనే భద్రాచలం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు మరియు పోలీసులు ప్రజలను కోరుతున్నారు.



## శ్రీ చెన్నకేశవ స్వామికి పూజలు నిర్వహించిన గ్రామస్థులు

- ఆలయ పునర్నిర్మాణం చేయాలని ప్రజల డిమాండ్
- గ్రామ ప్రజల విశ్వాసాలను కాపాడాలని ఉక్కుల అశోక్ విజ్ఞప్తి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని చింతపల్లి గూడ గ్రామంలోని ప్రగతి వెంచర్‌లో ఉన్న పురాతన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ఆదివారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని గ్రామ ప్రజలు అత్యంత పవిత్రమైన దేవస్థానంగా భావిస్తూ తరతరాలుగా పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. కోరిన కోరికలు తీర్చే ఆలయంగా ఈ దేవాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందని గ్రామ పెద్దలు తెలిపారు. ఇటీవల ఆలయం కూల్చివేత ఘటనపై గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆలయ ప్రాంగణానికి చేరుకుని శ్రీ చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, "మా గ్రామ దైవంగా భావించే చెన్నకేశవ స్వామి ఆలయాన్ని తిరిగి నిర్మించాలి. వందేళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని కాపాడటం అందరి బాధ్యత" అని పేర్కొన్నారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను దెబ్బతీసే చర్యలు సమాజంలో విభేదాలకు దారితీస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.దళిత చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఉక్కుల అశోక్ మాట్లాడుతూ... గ్రామ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు జోగు శేఖర్, ఉడుతల రవి గౌడ్, జోగు సంజీవ, కొండ్రు రాములు, జోగు పోచయ్య, జోగు స్వామి, జోగు రాములు, జోగు పెంటయ్య, జోగు ముత్తయ్య, జోగు మహేందర్, చెరుకూరి గిరితో పాటు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పెంచిన ఇంధన ధరలతో సామాన్యుల బ్రతుకులు భారం

- అధిక ధరలను నియంత్రించి పన్నుల భారం తగ్గించాలి
- సిపిఎం కీసర సర్కిల్ నాయకులు బంగారు నర్సింగరావు



**కుషాయిగూడ, మహా :** పెంచిన ఇంధన ధరలను తగ్గించి సామాన్యుల జీవన విధానాన్ని నియంత్రించి పన్నుల భారం తగ్గించాలని సిపిఎం కీసర సర్కిల్ నాయకులు బంగారు నర్సింగ్ రావు డిమాండ్ చేశారు. పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని కోరుతూ కీసర సర్కిల్ జవహర్ నగర్ బాలాజీ నగర్ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం కీసర సర్కిల్ నాయకులు బంగారు నర్సింగరావు హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల నడ్డి వీరిచే విధంగా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను అమాంతం పెంచడం దుర్మార్గమన్నారు. పెట్రోల్ డీజిల్ రేట్లు పెరగడం వలన రవాణా చార్జీలు పెరిగి నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉందన్నారు. రోజు వారు ఖర్చులు పెరిగి సామాన్య ప్రజల బతుకు బారంగా మారి అర్థాకలితో అలమటించే రోజులు పునరావృతం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఏఐఎఫ్ టీయు రాష్ట్ర అధ్యక్షులు వై. మల్లేష్ మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో బతుకుతున్న ప్రజలపై ఇంధన భారం మోపే ప్రభుత్వాలను గద్దె దింపితే తప్ప ప్రజల బతుకులు మారవన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి ఇందన ధరలను నియంత్రించి ప్రజలపై భారాన్ని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జవహర్ నగర్ డివిజన్ నాయకులు శివన్నారాయణ, చింతకింది అశోక్, కార్మిక సంఘాల నాయకులు డి. నగేష్, చంద్రశేఖర్, కుమార్, నాగరాజు, సూరి, సాయి ,రాజు, అంజనేయులు, లక్ష్మణ్, బాలరాజు, నరసింహ ,లింగమ్మ, పద్మ, స్వామి, రాములు, రంజాన్, షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ బూర్గంపాడు విద్యార్థినికి జిల్లా స్థాయి ప్రతిభా పురస్కారం

ఇంటర్ ఫలితాల్లో 976 మార్కులతో జిల్లా మూడో ర్యాంకు సాధించిన బి. నీలిమ



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (KGBV) కళాశాలకు చెందిన MPHW ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బి. నీలిమ ఇంటర్మీడియట్ ఫలితాల్లో 976 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు కైవసం చేసుకుంది.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా విద్యార్థినికి రూ.10,000 నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. విద్యార్థిని సాధించిన ప్రతిభ పట్ల అధికారులు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి, మేయర్ మరియు ఇతర అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు కూడా కష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. బి. నీలిమ సాధించిన విజయాన్ని ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.అలాగే విద్యార్థిని విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని, ముఖ్యంగా KGBV ప్రత్యేక అధికారి (ఎస్ఓ) మేడంను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వెంచర్ చేసి చేతులు దులుపుకున్న నాయకులు

కనీస సమస్యలు పట్టించుకోని వెంచర్ చేసిన యజమానులు



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ పరిధిలోని నాలుగవ వార్డులో పద్మావతి ఫేస్ 2 వెంచర్ ను స్థానిక ప్రజాప్రతినిధులు గత కొన్నేళ్ల క్రితం నిర్మించారు. అయితే అప్పట్లో నిర్మించిన ఈ వెంచర్ లో కనీస మౌలిక వసతులు కాదు కదా కనీసం అండర్ డ్రైనేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ వెంచర్ లో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అండర్ డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడంతో ఇంట్లో నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో స్థానికంగా ఉంటున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇష్టాను సారంగా వెంచర్ ఏర్పాటు చేసి అందులోని ప్లాట్లను విక్రయించి చేతులు దులుపుకున్న యాజమాన్యంపై ప్లాట్ల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**వెంచర్ అభివృద్ధికి రూ. 40 లక్షల సొమ్ము ఉంది...**

హిమాయత్ నగర్ రెవెన్యూ పరిధిలోని పద్మావతి ఫేస్ 2 వెంచర్ అభివృద్ధికి దాదాపు రూ 40 లక్షలు పోగు వేసినట్లు తెలిసింది. అయితే ఈ డబ్బులు ఎవరి దగ్గర ఉన్నాయో అర్థం కావడం లేదు. కాగా వెంచర్ ఏర్పాటు చేసినప్పుడు వెంచర్ అభివృద్ధికి దాదాపు రూ. 40 లక్షలు ప్రత్యేక వినియోగానికి తీసిపెట్టారు. కానీ నేడు వెంచర్ లో అండర్ డ్రైనేజ్ లేక పోవడంతో మురుగు నీరు రోడ్డుపై వస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదు. వెంచర్ అభివృధి కోసం తీసిన డబ్బులు అండర్ డ్రైనేజ్ కోసం వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా వెంచర్ చేసిన నాయకులు గతంలో వెంచర్ అభివృద్ధి కై అప్పట్లో తీసిన అక్షరాల నలభై లక్షలు ఎవరి జోబీలో ఉన్నాయో ఇపుడు వచ్చి కాలనీ వాసుల సమస్యలు తీర్చాలని వేడుకుంటున్నారు.

**అనుమతి లేని వెంచర్లో ప్రైవేటు హాస్టళ్లు**

నగర శివారు మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లోని 4వ వార్డులో అనేక ప్రైవేటు వెంచర్లు వెలిశాయి. వీటికే అనుమతులు లేవు. అందులో అనేక హాస్టళ్లు వెలిశాయి. వీటికి అనుమతులు అసలే లేవు. ప్రభుత్వ అనుమతి లేని వెంచర్లో ప్రైవేటు హాస్టల్లో వెలిశాయి. ఆ హాస్టల్ ద్వారా 6 కాలనీకి మరింత అండర్ డ్రైనేజ్ సమస్య తలెత్తుతుందని కాలనీవాసులు తెలుపుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరిస్తారని కోరుకుంటున్నాము

**4వ వార్డు కౌన్సిలర్ షాబాద్ కిషన్**

కౌన్సిలర్ షాబాద్ కిషన్ మాట్లాడుతూ పద్మావతిలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టిన కాలనీవాసులకు ఇబ్బందికరంగా నిర్మించిన వెంటనే అధికారులకు ఫిర్యాదు చేసి కాలనీ ప్రజలకు న్యాయం జరిగేలా ముందుంటానని తెలియజేస్తున్నాను నిర్మాణం జరిగినా అడ్డుకొని కాలనీ ప్రజలకు న్యాయం చేసేందుకు ముందుంటానని అలాగే నాలుగో వార్డ్ మున్సిపాలిటీలోనే ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని తెలియజేస్తున్నాను.

**మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్**

మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ తాను రేపు పద్మావతి వెంచర్లో పర్యటించి ఉన్న సమస్యలు తెలుసుకుని తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

## భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ బ్యూటిషియన్ శిక్షణ ముగింపు కార్యక్రమం

250 గంటల వృత్తి శిక్షణ పూర్తి చేసిన విద్యార్థినులకు ధ్రువపత్రాల ప్రదానం



**భద్రాచలం మహా :** భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో ఉద్యోగ మార్గదర్శక మరియు నియామక విభాగం, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అసిస్టెంట్ బ్యూటిషియన్ ట్రైనింగ్ వాలెడిక్టరీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఐటీసీ ఎంఎస్‌కే ప్రథమ్ వృత్తి శిక్షణ కేంద్రం సహకారంతో నిర్వహించిన ఈ 250 గంటల సహాయ సౌందర్య నిపుణుల శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి, మార్చి 2026 నెలల్లో కళాశాల చివరి సంవత్సరం చదువుతున్న బాలికల కోసం ప్రత్యేకంగా నిర్వహించారు. శిక్షణ విజయవంతంగా పూర్తికావడంతో ఆదివారం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె. జాన్ మిల్టన్, ఐటీసీ మేనేజర్ డి. చెంగల్ రావు, భగవాన్ స్వీట్స్ ప్రతినిధి శంకర్ రావు, సౌందర్య శిక్షణ కేంద్రం అధిపతి అనూష పాల్గొని శిక్షణ పొందిన విద్యార్థినులకు ధ్రువపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థినులు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలు కూడా సాధించుకోవడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు మహిళా సాధికారతకు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఉద్యోగ మార్గదర్శక మరియు నియామక విభాగం, మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త డాక్టర్ వి. రాఘసుమ ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో విద్యా సమన్వయకర్తలు శ్రీమతి హవిలా, శ్రీమతి హిమజ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తాగి.. వాహనం నడిపితే

## ఆరు నెలలు జైలుకే

- ఆరోగ్యం, ప్రాణం... రెండు మీ చేతుల్లోనే ఉన్నాయి
- డ్రంక్ అండ్ డ్రైవ్ లో 54 మంది డ్రైవర్లు పట్టుబడ్డారు
- జవహర్ నగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్



**కుషాయిగూడ, మహా :** మద్యం తాగి.. వాహనం నడుపుతూ పట్టుబడితే ఆరు నెలల జైలు శిక్ష పదివేల జరిమానా తప్పదని జవహర్ నగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ హెచ్చరించారు. జవహర్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి దమ్మాయిగూడలో ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాన్ని నడపవద్దని ఆరోగ్యం.. ప్రాణం... రెండు మీ చేతుల్లోనే ఉన్నాయని విలువైన జీవితాన్ని నాశనం చేసుకొని కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చవద్దని అన్నారు. సమాజంలో 70% మరణాలు రోడ్డు ప్రమాదాల కారణంగానే జరుగుతున్నాయని మద్యం మత్తులో నడిపే వారే అత్యధికంగా చనిపోతున్నారని తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ఇతర వ్యక్తుల మరణానికి కారణమైతే వారే శిక్షార్హులు అవుతారని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 54 మంది డ్రైవర్లు పట్టు పడ్డారని తెలిపారు. మద్యం మత్తులో వాహనాన్ని ఎట్టి పరిస్థితుల్లో నడపవద్దని మీ విలువైన జీవితాన్ని మీ కుటుంబ సభ్యులకు మీరు చాలా ముఖ్యమని భావించి సమాజంలో ఎంతోమంది మరణానికి కారణం అవుతూ వాళ్ళ కుటుంబాలకు రోడ్డున పడేయవద్దని ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయండి

కొండమడుగు నర్సింహ్మ
జిల్లా ప్రధాన కార్యదర్శి




**యాదాద్రి భువనగిరి, మహా:** మే 18,19 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ ఒక ప్రకటన విజ్ఞప్తి చేశారు జిల్లా రెండవ మహాసభలు మోత్కూరు పట్టణంలో పట్టణంలో 2022 నవంబర్ 26,27 తేదీలలో నిర్వహించామని తెలిపారు. గత మూడున్నర సంవత్సరాలుగా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించామని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పేదలు సాగు చేసుకుంటున్నా ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ బుక్కులు ఇవ్వాలని, జిల్లాల కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధం ఎత్తివేయాలని ఉద్యమాలు చేపట్టామని అన్నారు. చౌటుప్పల్ మండలంలో మల్కాపురం, తూప్రాన్ పేట, సింగరాయ చెరువు, చిన్న కొండూరు నారాయణపురం మండలంలోని రాచకొండ ప్రాంత భూములకు సంబంధించిన రైతుల సమస్యలపై, పోచంపల్లి మండలంలోని జలాల్ పూర్, మెహన్ నగర్ గ్రామాలలోని భూములు, భువనగిరి మండలంలోని హమ్మాపురం, మోటకొండూరు మండలంలోని వర్టూరు, గుండాల మండలం కేంద్రంలోని భూములను పేదలు సాగు చేసుకుంటున్న వాటికి పట్టాలు ఇవ్వాలని పోరాటాలు నిర్వహించి మాటూరు గ్రామంలో పేదలకు పట్టాలు కూడా ఇప్పించామని తెలిపారు. జిల్లాలో చౌటుప్పల్, బీబీ నగర్, పోచంపల్లి, భువనగిరి, బొమ్మలరామారం మండలాల్లో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధాన్ని ఎత్తివేయాలని ఉద్యమాలు కొనసాగించినామని తెలిపారు. మరోపక్క బస్వాపురం రిజర్వాయర్ లో భూములు కోల్పోయిన రైతులు, ఇల్లు కొల్పోపోతున్న పేదలకు, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఆ భూముల మీద ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కూలీల కూడా నష్టపరిహారం ఇవ్వాలని పోరాటాలు నిర్వహించామని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులు తెచ్చి కూలీలకు రెండు పూటల తిండి పెడుతున్న ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం జిరాంజీ చట్టం తెచ్చి ఎత్తివేయాలని కుట్రలు చేస్తుందని ఆ కుట్రలకు వ్యతిరేకంగా మూడు సంవత్సరాల కాలంలో అనేక ఉద్యమాలు చేపట్టామని తెలిపారు. వ్యవసాయ కూలీలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు చట్టం అమలు చేయాలని, విద్యా, వైద్యం, ఉపాధి ప్రభుత్వం బాధ్యత తీసుకొని కల్పించాలని, పాలకులు ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, దళిత, గిరిజన వాడలు, కూలీ పేటలు అభివృద్ధి చేయాలని అనేక కార్యక్రమాలు పోరాటాలు నిర్వహించామని ఈ మూడున్నర సంవత్సరాలలో నిర్వహించిన పోరాటాలను, ఉద్యమాలను సమీక్షించుకోవడానికి, పోరాటాలు రూపొందించుకోవడానికి ఈ రెండు రోజులపాటు రామన్నపేటలో నిర్వహిస్తున్న మహాసభలు వేదిక కాబోతున్నాయని తెలిపారు.



## చప్పట్ల కార్యక్రమములో ఆరోగ్యమైన జీవితం...

**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో ఆదివారం ప్రపంచ చప్పట్ల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కనకయ్య, నాయకులు గొట్టి పాముల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం సాయంత్రం 10 నిమిషాలు పాటు చప్పట్లు కొట్టిన జీవితాలు ఆరోగ్యవంతంగా ఉంటాయని వారు అన్నారు. గతంలో పూర్వీకులు ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాల ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపారని వారు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరాజు, మధు, ఆంజనేయులు, మంచన మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిని వీడి బీఆర్ఎస్‌లో చేరికలు..



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలోని బీజేపీ సీనియర్ నాయకులు గూడెపు రాజేందర్ తో పాటు సీనియర్ నాయకులు గూడెపు బలవంత్ రావు, గూడెపు గోపాల్, గూడెపు రవి కిరణ్, గూడెపు కళ్యాణ్ సంపత్ తదితరులు బిజెపి నుంచి బిఆర్ఎస్ పార్టీలో ఆదివారం చేరారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో మాజీ జడ్పిటిసి బుర్కుంట సతీష్ ఆధ్వర్యంలో బిజెపి నుండి సుమారు 50 మంది నాయకులు కార్యకర్తలకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మురళీధర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కోలాన్ ప్రదీప్ రెడ్డి,కోన్నెమొల్ల శ్రీనివాస్, కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షులు మంచర్ల మోహన్ రావు, జయసింహ, రాహుల్, మంచర్ల శ్రీనివాస్, గుంటి చరణ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంసెట్ స్టేట్ ర్యాంక్ సాధించిన గజ్జి వర్షిత



**వలిగొండ, మహా :** వలిగొండ మండలంలోని పొద్దుటూరు గ్రామానికి చెందిన గజ్జి వర్షిత ఎస్ కే ఎస్ అకాడమీ వనస్థలిపురం హైదరాబాదు నందు ఎంసెట్.లో2684 స్టేట్ ర్యాంకు సాధించడం తండ్రి గంగారం మార్గదర్శి అయితే తల్లి యొక్క క్రమశిక్షణ నేర్పిస్తూ చదువు పట్ల శ్రద్ధ చూపిన వర్షిత స్టేట్ ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు

## శ్రీ వినాయక పెయింటర్స్ యూనియన్ అసోసియేషన్



**నూతన అధ్యక్షుడిగా గోపే శివకుమార్ ఎన్నిక**

**యాదాద్రి భువనగిరి, మహా:** భువనగిరి పట్టణం లో ఆదివారం జరిగిన శ్రీ వినాయక పెయింటర్స్ యూనియన్ అసోసియేషన్ సమావేశంలో సంఘ సభ్యులు ఏకగ్రీవంగా గోపే శివకుమార్ ను నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గోపే శివకుమార్ మాట్లాడుతూ భువనగిరి పట్టణంలోని పెయింటింగ్ షాప్ యజమానులు స్థానిక పెయింటర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇతర రాష్ట్రాల వారికి పనులు అప్పగించకుండా ముందుగా భువనగిరి టౌన్‌కు చెందిన స్థానిక కార్మికులకు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక కార్మికుల ఉపాధి పరిరక్షణ, వారి కుటుంబాల ఆర్థిక అభివృద్ధి కోసం సంఘం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. అలాగే సంఘ సభ్యుల ఐక్యతతో పెయింటింగ్ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సంఘ సభ్యులు, పెద్దలు మరియు కార్మికులు నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షుడు :గోపే శివకుమార్ గౌరవ అధ్యక్షులు గోపే శ్రీనివాస్,ఉపాధ్యక్షులు కొయ్యేడి నరసింహ, పడిగే స్వామిప్రధాన కార్యదర్శి, మాటూరు ఆంజనేయులు, బిట్టు సుధాకర్ కోశాధికారి, సిరువంగి నాగరాజు, బర్రె పాండు సలహాదారులుగా చేగురు జంగయ్య, బండారు దయాకర్, కోయడి రమేష్, పాశం నరేష్ సహాయ కార్యదర్శులుగా కరకల రమేష్, కస్తూరి కృష్ణ, షేక్ ఆసిఫ్ కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎన్నుకున్నారు పాండే, మేకల మహేష్, హేమేష్ పెయింటర్స్ :రాజు, అమరేందర్, కృష్ణ, నరి, నరసింహ, శివ, తదితరులు పాల్గొన్నారు

# యూట్యూబర్‌గా అడుగుపెట్టిన నారా దేవాన్ష్

- 'డైనో డీట్స్' ఛానల్ ప్రారంభం
- డైనోసార్ల ప్రపంచంలోకి తీసుకెళ్లనున్న దేవాన్ష్
- టీజర్‌లో మంత్రి లోకేశ్ సందడి
- చెస్‌లో రికార్డుల నుంచి పాడ్‌కాస్ట్ ల దాకా
- నారా, నందమూరి కుటుంబాల శుభాకాంక్షలు



**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తనయుడు, నారా చంద్రబాబు నాయుడి మనవడు నారా దేవాన్ష్ డిజిటల్ ప్రపంచంలోకి సరికొత్త అడుగు వేశారు. తనలోని ప్రతిభను నలుగురితో పంచుకునేందుకు, తనకున్న ఆసక్తులను ప్రపంచానికి తెలియజేసేందుకు ఆయన ఒక యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారు. చిన్న వయసులోనే చదరంగంలో ప్రపంచ రికార్డు సృష్టించిన దేవాన్ష్, ఇప్పుడు పాడ్‌కాస్ట్‌ల ద్వారా వీక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సరికొత్త ప్రయాణం పట్ల నారా, నందమూరి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సరికొత్త ప్రపంచంలోకి 'డైనో డీట్స్'**

నారా దేవాన్ష్ తాజాగా 'డైనో డీట్స్' అనే పేరుతో తన సొంత యూట్యూబ్ ఛానల్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ ఛానల్ ప్రధానంగా డైనోసార్లు, ప్రాచీన జీవజాలం , పురాతన అవశేషాల గురించి ఆసక్తికరమైన విషయాలను చర్చించేందుకు ఉద్దేశించబడింది. తాను తెలుసుకున్న ఎన్నో ఆశ్చర్యకరమైన నిజాలను, డైనోసార్ల ప్రపంచంలోని వింతలు మరియు విశేషాలను దేవాన్ష్ తనదైన శైలిలో ప్రేక్షకులకు అందించనున్నారు. నవ్విస్తూనే ఆలోచింపజేసేలా ఆయన రూపొందించిన పాడ్‌కాస్ట్‌లు ఈ ఛానల్ ద్వారా అందుబాటులోకి రానున్నాయి.

**టీజర్‌లో తండ్రి లోకేశ్ సందడి**


ఈ యూట్యూబ్ ఛానల్‌కు సంబంధించిన ప్రచార చిత్రంలో (టీజర్) సాక్షాత్తూ రాష్ట్ర మంత్రి, దేవాన్ష్ తండ్రి నారా లోకేశ్ పాలుపంచుకోవడం విశేషం. తన కుమారుడితో కలిసి వీడియోలో నటించిన ఆయన, దేవాన్ష్ ప్రారంభించిన ఈ పాడ్‌కాస్ట్ మరియు యూట్యూబ్ ఛానల్ ప్రత్యేకతలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సరికొత్త ప్రయత్నం పట్ల ఆయన ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.


**ఉద్వేగభరితులైన మంత్రి నారా లోకేశ్**

తన కుమారుడు సృష్టించిన ఈ ప్రాచీన డైనోసార్ల ప్రపంచంలోకి తాను కూడా ఒక సాధారణ ప్రేక్షకుడిలా ప్రవేశించేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా తన భావాలను పంచుకున్నారు. ఒక తండ్రిగా తన కుమారుడి ఎదుగుదలను చూసి ఆయన ఎంతో ఉద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా దేవాన్ష్‌కు నారా, నందమూరి కుటుంబ సభ్యులందరూ తమ హృదయపూర్వక ఆశీస్సులు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రేక్షకుల ముందుకు వస్తున్న నారా దేవాన్ష్‌కు ఇప్పటికే అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్న ఘనత ఉంది. ఎంతో క్లిష్టమైన చదరంగం (Chess) క్రీడలో ఆయన తన అద్భుతమైన మేధస్సును నిరూపించుకున్నారు. ప్రఖ్యాత '5334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్' పుస్తకంలోని 175 అతి క్లిష్టమైన చెక్‌మేట్ పజిల్స్‌ను గతేడాది అతి తక్కువ సమయంలో పరిష్కరించిన దేవాన్ష్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఆ రికార్డు ద్వారా ఆయన 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా ప్రపంచ స్థాయి గుర్తింపును పొందారు.

# పార్టీ పెడితే పక్కా గెలిచేటోన్ని..

- విజయ్ నాకు సమవుజ్జీ కానేకాదు
- కమల్ హాసన్ సీఎం అయితేనే అసూయపడతా
- రాజకీయాలకు శాశ్వతంగా గుడ్‌బై
- ద్రావిడ పార్టీలను ఓడించిన విజయ్‌ను చూసి షాకయ్యా
- చిన్న పొరపాటు చేసినా దళపతికి భారీ మూల్యం
- స్టాలిన్ నాకు మంచి మిత్రుడు.. నేను నీచమైన వ్యక్తిని కాదు
- తమిళ రాజకీయాలపై తలైవా హాట్ కామెంట్స్






**హైదరాబాద్, మహా:** తమిళనాడు రాజకీయాల్లో ప్రముఖ నటుడు దళపతి విజయ్ సృష్టించిన ప్రభంజనం, ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన పరిణామాలపై ఎట్టకేలకు సూపర్ స్టార్ రజనీకాంత్ నోరువిప్పారు. ఎప్పుడూ తనదైన శైలిలో కూల్‌గా స్పందించే తలైవా, ఈసారి మాత్రం రాజకీయాలపై, విజయ్‌తో తనకున్న పోలికలపై కుండబద్దలు కొట్టినట్లు సమాధానాలు ఇచ్చారు. విజయ్ సాధించిన అఖండ విజయం, మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్‌తో తనకున్న మైత్రి, తన సమకాలికుడు కమల్ హాసన్‌పై తనకున్న భావాలను ఆయన నిక్కచ్చిగా బయటపెట్టారు. తనకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని, అనవసరమైన విషయాలు మాట్లాడే చవకబారు వ్యక్తిని తాను కాదని ఆయన చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు తమిళనాట రాజకీయంగా, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**పార్టీ పెడితే పక్కా గెలిచేటోన్ని**

తమిళ రాజకీయాలపై మరియు తన రాజకీయ ప్రవేశంపై సూపర్ స్టార్ రజనీకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తానెప్పుడో రాజకీయాల నుంచి తప్పుకున్నానని, ఇప్పుడు తనకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఒకవేళ తాను గనక రాజకీయాల్లోకి వచ్చి సొంతంగా పార్టీ పెట్టి ఉంటే మాత్రం పక్కాగా గెలిచేవాడినని ఆయన గట్టి ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఆయన రాజకీయాల్లోకి వస్తారని భారీ అంచనాలు ఉండి, ఆ తర్వాత ఆయన వెనక్కి తగ్గిన నేపథ్యంలో.. ఇప్పుడు ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు మరోసారి ఆయన మాస్ ఫాలోయింగ్‌ను గుర్తుచేస్తున్నాయి.

**విజయ్ నాకు ఏమాత్రం సమవుజ్జీ కాదు**

ప్రస్తుత ముఖ్యమంత్రి దళపతి విజయ్‌తో తనను పోల్చడంపై రజనీకాంత్ స్పష్టమైన వివరణ ఇచ్చారు. విజయ్ తనకు ఏమాత్రం సమవుజ్జీ కాదని, ఇద్దరి మధ్య పోలిక తేవడం పూర్తిగా అసంబద్ధమని ఆయన కొట్టిపారేశారు. దానికి ప్రధాన కారణం వయసు అని చెబుతూ.. విజయ్‌కు, తనకు మధ్య ఏకంగా 28 ఏళ్ల వ్యత్యాసం ఉందని గుర్తుచేశారు. ఒక సీనియర్ నటుడిగా తన ప్రస్థానం వేరని, ఒక యువ నాయకుడిగా విజయ్ ప్రయాణం వేరని స్పష్టం చేస్తూ, అభిమానుల మధ్య జరుగుతున్న అనవసరమైన పోలికలకు ఆయన చెక్ పెట్టారు.

**కమల్ సీఎం అయితేనే నాలో అసూయ**

విజయ్ ముఖ్యమంత్రి కావడం పట్ల తనలో ఎలాంటి అసూయా లేదని రజనీకాంత్ కుండబద్దలు కొట్టారు. అయితే, తన సమకాలికుడు, దశాబ్దాల పాటు తనతో కలిసి సినీ రంగంలో ప్రయాణించిన మిత్రుడు కమల్ హాసన్ గనుక ముఖ్యమంత్రి అయి ఉంటే మాత్రం తాను కచ్చితంగా అసూయపడేవాడినని ఆయన తన మనసులోని మాటను ఎంతో ఆసక్తికరంగా బయటపెట్టారు. ఈ వ్యాఖ్యలు కమల్ మరియు రజనీ మధ్య ఉన్న సుదీర్ఘమైన, ఆరోగ్యకరమైన పోటీని తెలియజేస్తున్నాయి.

**సింగిల్‌గా గెలిచిన దళపతిని చూసి షాకయ్యా**

తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో దళపతి విజయ్ సాధించిన అనూహ్య విజయం చూసి తాను మొదట తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని రజనీకాంత్ అంగీకరించారు. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను శాసిస్తున్న రెండు అతిపెద్ద ద్రావిడ పార్టీలను (డీఎంకే, అన్నాడీఎంకే) ఒంటరిగా ఎదుర్కొని ఒక యువ నాయకుడు నెగ్గడం మామూలు విషయం కాదని ఆయన ప్రశంసించారు. అయితే, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ.. తమిళనాడు ప్రజలకు విజయ్ కచ్చితంగా మంచి చేస్తాడనే అపారమైన నమ్మకం తనకు ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**మర్యాద కోసం సీఎంను కలిసే ఆసక్తి లేదు**

సాధారణంగా ఎవరైనా కొత్తగా ముఖ్యమంత్రి పదవి చేపడితే సినీ ప్రముఖులు వెళ్లి మర్యాదపూర్వకంగా కలవడం ఆనవాయితీగా వస్తోంది. కానీ, రజనీకాంత్ మాత్రం ఈ విషయంలో అత్యంత స్పష్టంగా ఉన్నారు. కేవలం ఒక మర్యాద కోసమో, ఫార్మాలిటీ కోసమో ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్‌ను కలవాలన్న ఆసక్తి తనకు ఏమాత్రం లేదని ఆయన తేల్చి చెప్పారు. తనకు రాజకీయాలతో పనే లేదని, అందువల్ల ఒక రాజకీయ నాయకుడి హోదాలో ఉన్న వ్యక్తిని కలవడం వల్ల వచ్చే ఊహాగానాలకు తాను దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు.

**చిన్న పొరపాటు చేసినా విజయ్‌కు భారీ మూల్యం**

ముఖ్యమంత్రిగా పరిపాలనా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కు రజనీకాంత్ ఒక సీనియర్‌గా సున్నితమైన హెచ్చరిక జారీ చేశారు. రాష్ట్ర ప్రజలు పాత పార్టీలను కాదని విజయ్‌పై ఎన్నో కొండంత ఆశలు, భారీ అంచనాలు పెట్టుకున్నారని ఆయన గుర్తుచేశారు. ప్రజల అంచనాలు ఆ స్థాయిలో ఉన్నప్పుడు, పాలనలో ఏమాత్రం చిన్న పొరపాటు చేసినా అది విజయ్ ప్రతిష్ఠపై, రాజకీయ భవిష్యత్తుపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతుందని, కాబట్టి ప్రతి నిర్ణయం అత్యంత ఆచితూచి తీసుకోవాలని ఆయన సూచించారు.

**మాజీ సీఎం స్టాలిన్ నాకు అత్యంత ఆప్త మిత్రుడు**


ఇటీవల ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్‌ను తాను కలవడం వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవని రజనీకాంత్ వివరణ ఇచ్చారు. స్టాలిన్ తనకు ఎప్పటినుంచో అత్యంత సన్నిహితుడని, ఒక మంచి మిత్రుడు అని ఆయన తెలిపారు. కేవలం ఒక స్నేహితుడిగా మాత్రమే తాను కష్టకాలంలో ఉన్న స్టాలిన్‌ను కలిశానని, ఆ భేటీ వెనుక రాజకీయ కారణాలు వెతకొద్దని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాలకు, వ్యక్తిగత స్నేహాలకు ముడిపెట్టవద్దని ఆయన పరోక్షంగా విజ్ఞప్తి చేశారు.

**నేను నీచమైన, చవకబారు వ్యక్తిని కాను**

తనపై, తన తాజా సమావేశాలపై వస్తున్న రకరకాల ఊహాగానాలను మరియు కొందరు చేస్తున్న విమర్శలను రజనీకాంత్ తీవ్ర స్థాయిలో ఖండించారు. తాను అనవసరమైన విషయాలపై పదేపదే మాట్లాడే చవకబారు, నీచమైన వ్యక్తిని కాదని ఆయన చాలా ఘాటుగా బదులిచ్చారు. ఒకసారి తాను రాజకీయాలకు దూరంగా ఉంటానని బహిరంగంగా ప్రకటించిన తర్వాత, మళ్లీ పరోక్షంగా రాజకీయాలు చేసే రకం తాను కాదని తన వ్యక్తిత్వాన్ని ఆయన గట్టిగా సమర్థించుకున్నారు. మొత్తానికి విజయ్, స్టాలిన్, కమల్ హాసన్ – ఈ ముగ్గురితో తనకున్న వ్యక్తిగత , రాజకీయ సమీకరణాలను అత్యంత పారదర్శకంగా వివరిస్తూ, తనపై ఎవరూ 'రాజకీయ స్వార్థం' అనే ముద్ర వేయకుండా రజనీకాంత్ ఒక పర్ఫెక్ట్ పొలిటికల్ మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఐ బొమ్మ, బప్పంపై ఉక్కుపాదం

- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిల్మ్ ఛాంబర్ ఫిర్యాదు
- కొత్త సైట్లతో రెచ్చిపోతున్న పైరసీ కేటుగాళ్లు
- ఆ వెబ్‌సైట్‌తో నాకు ఎలాంటి సంబంధం లేదు
- క్లారిటీ ఇచ్చిన 'ఐ బొమ్మ' రవి
- కొత్త సినిమాల లీక్‌పై కేసు నమోదు
- దర్యాప్తు ముమ్మరం చేసిన సైబర్ పోలీసులు




**హైదరాబాద్, మహా:** తెలుగు సినీ పరిశ్రమను దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న పైరసీ భూతం మరోసారి బుసలు కొడుతోంది. కోట్లు ఖర్చు పెట్టి, ఎంతో శ్రమకోర్చి తీసిన సినిమాలను థియేటర్లలో విడుదలైన కొన్ని గంటల్లోనే హెచ్‌డీ క్వాలిటీతో ఆన్‌లైన్‌లో లీక్ చేస్తూ నిర్మాతల కడుపు కొడుతున్న పైరసీ వెబ్‌సైట్లపై టాలీవుడ్ తీవ్ర స్థాయిలో మండిపడుతోంది. గతంలో సినీ పరిశ్రమకు కంటిమీద కునుకు లేకుండా చేసిన 'ఐ బొమ్మ' పేరు మరోసారి తెరపైకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. పాత ఐ బొమ్మ మూతపడినా, అదే పేరుతో కొత్త వెబ్‌సైట్లు పుట్టుకురావడం, వాటికి తోడు 'బప్పం' లాంటి కొత్త ప్లాట్‌ఫామ్‌లు తోడవడంతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తీవ్రంగా స్పందించింది. నేరుగా సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఈ ఆగడాలకు చెక్ పెట్టాలని అధికారికంగా ఫిర్యాదు చేసింది.

**ఫిల్మ్ ఛాంబర్ సీరియస్ యాక్షన్**

కొత్తగా విడుదలవుతున్న తెలుగు చిత్రాలకు పైరసీ బెడద తీవ్రం కావడంతో ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు అత్యవసరంగా సమావేశమై కీలక నిర్ణయం తీసుకున్నారు. నిర్మాతలు పెడుతున్న కోట్ల రూపాయల పెట్టుబడికి రక్షణ లేకుండా పోతోందని, పైరసీ సైట్ల వల్లే థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య దారుణంగా పడిపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వినాశనానికి ప్రధాన కారణమవుతున్న 'ఐ బొమ్మ', 'బప్పం' వంటి వెబ్‌సైట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వారు సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

**ఐ బొమ్మ పేరుతో కొత్త కేటుగాళ్ల మోసం**

గతంలో తెలుగు రాష్ట్రాల్లో 'ఐ బొమ్మ' సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఆ వెబ్‌సైట్ మూతపడినప్పటికీ, ప్రేక్షకుల ఆదరణను, ఆ బ్రాండ్ పేరును క్యాష్ చేసుకునేందుకు కొందరు కేటుగాళ్లు రంగంలోకి దిగారు. అసలైన 'ఐ బొమ్మ'కు ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులు, ఆ పేరుతోనే అచ్చం అలాగే ఉండేలా కొత్త డొమైన్లను, వెబ్‌సైట్లను క్రియేట్ చేసి ప్రేక్షకులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ నకిలీ సైట్ల ద్వారానే వారు పైరసీ కంటెంట్‌ను విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్నట్లు ఫిల్మ్ ఛాంబర్ గుర్తించింది.

**ఆ సైట్‌తో నాకు సంబంధం లేదు: రవి**

ఈ వ్యవహారం ముదిరి పోలీసు కేసుల వరకు వెళ్లడంతో, గతంలో 'ఐ బొమ్మ'తో సంబంధం ఉన్నట్లుగా వార్తల్లో నిలిచిన రవి అనే వ్యక్తి తెరపైకి వచ్చారు. ప్రస్తుతం నెట్టింట హల్చల్ చేస్తున్న కొత్త 'ఐ బొమ్మ' వెబ్‌సైట్‌తో తనకు కానీ, తన పాత బృందానికి కానీ ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎవరో సైబర్ నేరగాళ్లు తమ పాత పేరును వాడుకుని ఈ కొత్త నకిలీ వెబ్‌సైట్‌ను క్రియేట్ చేశారని, దానికి బాధ్యులు తాము కాదని ఆయన పోలీసులకు మరియు మీడియాకు క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు.

**విడుదలైన రోజే ఆన్‌లైన్‌లో సినిమాలు**

ఈ నకిలీ ఐ బొమ్మ మరియు బప్పం వెబ్‌సైట్ల నిర్వాహకులు చాలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల భారీ అంచనాల మధ్య థియేటర్లలో విడుదలైన పలు చిన్న, పెద్ద సినిమాలను మొదటి షో పూర్తవ్వక ముందే హెచ్‌డీ ప్రింట్‌లతో తమ సైట్లలో అప్‌లోడ్ చేస్తున్నారు. దీనివల్ల వారాంతాల్లో థియేటర్లకు వెళ్లాలనుకునే ప్రేక్షకులు సైతం ఇంట్లోనే ఉచితంగా సినిమాలు చూసేస్తుండటంతో, వసూళ్లపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్మాతలు గగ్గోలు పెడుతున్నారు.

**రంగంలోకి సైబర్ క్రైమ్ పోలీసులు**

ఫిల్మ్ ఛాంబర్ నుంచి అందిన ఫిర్యాదును అత్యంత తీవ్రంగా పరిగణించిన సైబర్ క్రైమ్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఐ బొమ్మ, బప్పం పేర్లతో నడుస్తున్న వెబ్‌సైట్ల యూఆర్ఎల్స్ ఆధారంగా కేసు నమోదు చేశారు. ఆయా సైట్ల ఐపీ అడ్రస్‌లను ట్రేస్ చేసే పనిలో సాంకేతిక నిపుణుల బృందం నిమగ్నమైంది. విదేశీ సర్వర్ల ద్వారా ఈ సైట్లను ఆపరేట్ చేస్తున్నారా, లేక స్థానికంగా ఉంటూనే వీపీఎన్ ల ద్వారా పోలీసుల కళ్లు గప్పుతున్నారా అనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు.

**సోషల్ మీడియా వేదికగా లింక్‌ల పంపిణీ**


ఈ పైరసీ ముఠాలు కేవలం వెబ్‌సైట్లకు మాత్రమే పరిమితం కాకుండా తమ నెట్‌వర్క్‌ను టెలిగ్రామ్, వాట్సాప్ వంటి మెసేజింగ్ యాప్‌ల ద్వారా కూడా విస్తరిస్తున్నారు. సినిమాలు అప్‌లోడ్ చేసిన వెంటనే, ఆ సైట్లకు సంబంధించిన ప్రైవేట్ లింక్‌లను లక్షలాది మంది సభ్యులు ఉండే టెలిగ్రామ్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. పోలీసులు ఒక డొమైన్‌ను బ్లాక్ చేసినా, నిమిషాల వ్యవధిలోనే మరో డొమైన్‌ను క్రియేట్ చేసి మళ్లీ లింక్‌లను జనాల్లోకి వదులుతూ వ్యవస్థకు సవాల్ విసురుతున్నారు.

**నిర్మాతలకు కోట్లలో ఆర్థిక నష్టం**

సినిమా నిర్మాణ వ్యయాలు ఆకాశాన్ని అంటుతున్న ప్రస్తుత తరుణంలో, సినిమా విడుదలకు ముందే ఎన్నో ఆర్థిక కష్టాలను నిర్మాతలు ఎదుర్కొంటున్నారు. తీరా సినిమా విడుదలై పాజిటివ్ టాక్ తెచ్చుకున్నప్పటికీ, ఈ పైరసీ సైట్ల కారణంగా మొదటి వారం కలెక్షన్లు దాదాపు 30 నుంచి 40 శాతం మేర పడిపోతున్నాయని ట్రేడ్ పండితులు విశ్లేషిస్తున్నారు. ఈ ఆర్థిక నష్టం కేవలం నిర్మాతకే కాకుండా డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, థియేటర్ యాజమాన్యాలపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

# మార్కులు పెరిగితే ఫీజు వాపస్

- ఆన్-స్క్రీన్ మార్కింగ్ పారదర్శకం
- ఆన్సర్ షీట్లకు ఫుల్ సెక్యూరిటీ
- సీబీఎస్ఈ జవాబు పత్రాల వెరిఫికేషన్‌పై స్పష్టత
- ఆందోళనలకు చెక్ పెడుతూ విద్యార్థులకు ఊరట
- భయం వద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది



**హైదరాబాద్, మహా:** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రుల్లో సీబీఎస్ఈ క్లాస్ 12 ఫలితాల పట్ల వ్యక్తమవుతున్న ఆందోళనలు, సందిగ్ధతలకు కేంద్ర విద్యాశాఖ పూర్తి స్థాయిలో తెరదించింది. ఏ ఒక్క విద్యార్థికీ తన అర్హత కంటే తక్కువ మార్కులు వచ్చాయనే అసంతృప్తి కలగకూడదన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈసారి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా ఈసారి అమలు చేసిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం అత్యంత పారదర్శకమైనదని, ఇది పూర్తి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉందని విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన ప్రత్యేక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమమే కేంద్ర విద్యాశాఖ, సీబీఎస్ఈ ప్రథమ లక్ష్యమని ఉద్ఘాటించారు. ప్రతి సమాధానానికీ కచ్చితమైన, సరైన మూల్యాంకనం జరగాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది క్లాస్ 12 పరీక్షల మూల్యాంకనంలో ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానాన్ని పూర్తిస్థాయిలో, అత్యంత పకడ్బందీగా అమలు చేశారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులకు చెందిన సుమారు 98 లక్షల ఆన్సర్ షీట్లను అత్యాధునిక సాంకేతికతతో స్కాన్ చేసి, వాటిని సురక్షితమైన పీడీఎఫ్ కాపీలుగా మలిచారు. ఈ స్కానింగ్ ప్రక్రియలో ఏకంగా మూడు స్థాయిల భద్రతా ప్రమాణాలను పాటించారు. విద్యార్థులు రాసిన ఏ ఒక్క పేజీ కూడా మిస్ కాకుండా, ప్రతి చిన్న అక్షరం స్పష్టంగా కనిపించేలా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు.కొత్త విధానాన్ని అమలు చేయడంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు కూడా చేపట్టింది. కొంతమంది విద్యార్థులు జవాబు పత్రాలపై చాలా లైట్ కలర్ ఇంక్‌తో రాయడం వల్ల స్కాన్ కాని సుమారు 13 వేల ఆన్సర్ షీట్లను సాంకేతిక బృందం ప్రత్యేకంగా గుర్తించింది. వాటికి ఎలాంటి నష్టం కలగకుండా, అత్యంత నిపుణులైన ఉపాధ్యాయులతో ఆ పేపర్లను మాన్యువల్‌గా పరిశీలించి మార్కులు నమోదు చేయించారు. ఈ ఓఎస్ఎం విధానం వల్ల గతంలో మాన్యువల్ చెకింగ్‌లో ఎదురైన టోటలింగ్ తప్పిదాలను ఇప్పుడు వంద శాతం నివారించగలిగారు. అంతేకాకుండా, దేశంలో ఎక్కడి నుంచైనా సురక్షితంగా మూల్యాంకనం నిర్వహించే అవకాశం లభించడంతో నిష్పాక్షికత మరింత పెరిగిందని ప్రభుత్వం స్పష్టం చేసింది. వాస్తవానికి 2014లోనే ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని భావించినప్పటికీ, అప్పటి సాంకేతిక పరిమితుల వల్ల సాధ్యపడలేదు.

# ఎబోలా కలకలం

- ఎమర్జెన్సీ ప్రకటించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ
- వ్యాక్సిన్ లేని 'బుండిబుగ్యో' స్ట్రెయిన్
- కాంగో, ఉగాండాలో 88కి పైగా ప్రాణాలు బలి
- డబ్ల్యూహెచ్‌వో హెచ్చరికలతో అప్రమత్తమైన దేశాలు
- వణికిస్తున్న కొత్త స్ట్రెయిన్, 300కు పైగా కేసులు

**హైదరాబాద్, మహా:** ఆఫ్రికా ఖండంలో ఎబోలా మహమ్మారి మరోసారి పడగ విప్పింది. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, పొరుగున ఉన్న ఉగాండా దేశాల్లో ఈ ప్రాణాంతక వైరస్ శరవేగంగా వ్యాపిస్తోంది. కేవలం కొద్ది రోజుల వ్యవధిలోనే వందల సంఖ్యలో కేసులు నమోదు కావడం, పదుల సంఖ్యలో రోగులు ప్రాణాలు కోల్పోతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ తక్షణమే స్పందించింది. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆదివారం నాడు ఈ ఎబోలా వ్యాప్తిని 'పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్' (గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ) గా ప్రకటించింది. వ్యాక్సిన్ లేని ఒక అరుదైన స్ట్రెయిన్ ఇప్పుడు విజృంభిస్తుండటంతో ప్రపంచ దేశాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఈ వ్యాప్తి పాండమిక్ స్థాయికి చేరకముందే కట్టడి చేసేందుకు అంతర్జాతీయ ఆరోగ్య విభాగాలు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాయి.

**డబ్ల్యూహెచ్‌వో గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటన**

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎబోలా వ్యాప్తిపై అత్యున్నత స్థాయి హెచ్చరిక జారీ చేసింది. కాంగో, ఉగాండా దేశాల్లో వెలుగుచూస్తున్న తాజా ఎబోలా వ్యాప్తిని 'అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి'గా ప్రకటించింది. అయితే, ఇది ప్రస్తుతానికి పాండమిక్ (విశ్వమారి) ప్రమాణాలకు చేరలేదని స్పష్టం చేసింది. కాంగోతో భూ సరిహద్దులు పంచుకుంటున్న దేశాలకు మాత్రం తీవ్రమైన ముప్పు పొంచి ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

**ప్రమాదకరమైన 'బుండిబుగ్యో' స్ట్రెయిన్**

ప్రస్తుతం ఆఫ్రికాలో ప్రబలుతున్న ఎబోలా.. గతంలో అధికంగా కనిపించిన జైర్ స్ట్రెయిన్ కాదు. ఇది అత్యంత అరుదైన, ప్రమాదకరమైన 'బుండిబుగ్యో' స్ట్రెయిన్ అని డబ్ల్యూహెచ్‌వో నిర్ధారించింది. దీనికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి నిర్దిష్ట వ్యాక్సిన్లు, చికిత్స విధానాలు అందుబాటులో లేకపోవడం అత్యంత ఆందోళన కలిగించే అంశం. కాంగో ఆరోగ్యశాఖ మంత్రి శామ్యూల్ రోజర్ కంబా సైతం దీని మరణాల రేటు 50 శాతం వరకు ఉండొచ్చని, వ్యాక్సిన్ లేకపోవడం వల్ల వ్యాప్తి కట్టడి సవాలుగా మారిందని స్పష్టం చేశారు.

**వందల్లో కేసులు.. 88 మందికి పైగా మృతి**

ఆఫ్రికా సీడీసీ గణాంకాల ప్రకారం, కాంగో తూర్పు ప్రాంతమైన ఇటురి ప్రావిన్స్‌లో ఎబోలా కల్లోలం సృష్టిస్తోంది. బునియా, రవాంపరా, మోంగ్‌బ్వాలు వంటి ప్రాంతాల్లో కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. శనివారం నాటికి 336కు పైగా అనుమానిత కేసులు నమోదు కాగా, కనీసం 88 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారికంగా నిర్ధారించారు. ల్యాబ్ టెస్టుల్లో పాజిటివిటీ రేటు ఎక్కువగా వస్తుండటంతో, బయటపడని కేసులు ఇంకెన్నో ఉండొచ్చని వైద్య నిపుణులు అంచనా వేస్తున్నారు.

**రాజధానులకు పాకిన మహమ్మారి**

ఈ వైరస్ కేవలం గ్రామీణ లేదా అటవీ, మైనింగ్ ప్రాంతాలకే పరిమితం కాలేదు. సరిహద్దులు దాటి ఉగాండా రాజధాని కంపాలా, కాంగో రాజధాని కిన్షాసా నగరాలకు సైతం వేగంగా వ్యాపించింది. ఇటురి ప్రావిన్స్ నుంచి ప్రయాణించిన వారి ద్వారా ఈ వైరస్ నగరాలకు చేరుతోంది. ఉగాండా రాజధాని కంపాలాలో ఇప్పటికే ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి ల్యాబ్ పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. రద్దీగా ఉండే ప్రాంతాలకు వైరస్ చేరడం కలకలం రేపుతోంది.

**కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ ముప్పు**

పెరిఅర్బన్ మైనింగ్ ప్రాంతాల్లో చురుకైన కమ్యూనిటీ వ్యాప్తి (కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్) జరుగుతోందని ఆఫ్రికా సీడీసీ హెచ్చరించింది. వ్యాప్తిని గుర్తించడంలో నాలుగు వారాల జాప్యం జరగడం, సరైన సమయంలో కాంటాక్ట్ ట్రేసింగ్ జరగకపోవడం, రోగులకు చికిత్స అందిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు సైతం ప్రాణాలు కోల్పోతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇన్ఫెక్షన్ కంట్రోల్ విధానాల్లో ఉన్న లోపాలు ప్రాణ సంకటంగా మారుతున్నాయి.

**పొరుగు దేశాలకు పొంచి ఉన్న ముప్పు**

అంతర్జాతీయ ప్రయాణాల ద్వారా ఇప్పటికే వైరస్ వ్యాప్తి చెందిన కేసులు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, కాంగో సరిహద్దు దేశాలు అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది. అన్ని దేశాలు తమ జాతీయ విపత్తు మరియు అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాలను తక్షణమే యాక్టివేట్ చేయాలని సూచించింది. సరిహద్దుల వద్ద మరియు ప్రధాన అంతర్గత రవాణా మార్గాల్లో కఠినమైన స్క్రీనింగ్ చేపట్టాలని ఆదేశించింది.

**సరిహద్దుల మూసివేతకు వ్యతిరేకం**

ఎబోలా గ్లోబల్ ఎమర్జెన్సీ ప్రకటనతో ప్రపంచ దేశాలు భయాందోళనలకు గురికావొద్దని డబ్ల్యూహెచ్‌వో సూచించింది. భయంతో సరిహద్దులను మూసివేయడం లేదా ప్రయాణ, వాణిజ్య ఆంక్షలు విధించడం సరికాదని స్పష్టం చేసింది.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
సినిమా వార్తలు | MOVIE NEWS
సోమవారం, హైదరాబాద్ | 18-05-2026

# తెలుగు క్రికెటర్‌తో శ్రీలీల డేటింగ్..!

కన్నడ ముద్దుగుమ్మ, హీరోయిన్ శ్రీలీల గురించి టాలీవుడ్ ప్రేక్షకులకు చెప్పాల్సిన పనిలేదు. ఈ ముద్దుగుమ్మ స్టార్ హీరోల సరసన మెప్పించింది. ఈ ఏడాది పరాశక్తి చిత్రంతో తమిళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈ కన్నడభామ ప్రస్తుతం ధనుష్‌కు జంటగా కనిపించనున్నారు. తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఇక సినిమాల సంగతి పక్కనపెడితే.. ఈ ముద్దుగుమ్మపై గతంలో రూమర్స్ వినిపించాయి. బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్‌తో డేటింగ్‌లో ఉందంటూ వార్తలొచ్చాయి. వినాయక చవితి వేడుకల కోసం ఆమె తన తల్లితో కలిసి ముంబయిలోని కార్తీక్ ఇంటికి వెళ్లడంతో పుకార్లు వైరలయ్యాయి. అదే సమయంలో తనకు డాక్టర్ కోడలు కావాలని కార్తీక్ ఆర్యన్ తల్లి చెప్పడంతో మరింత ఆజ్యం పోసింది. కానీ వీటిపై ఎవరూ కూడా క్లారిటీ ఇవ్వలేదు. తాజాగా శ్రీలీలపై మరోసారి డేటింగ్ రూమర్స్ సోషల్ మీడియాలో గుప్పుమంటున్నాయి. ఈ సారి ఏకంగా టీమిండియా క్రికెటర్‌తో శ్రీలీల డేటింగ్‌లో ఉందంటూ కథనాలొస్తున్నాయి. మన తెలుగువాడు, యంగ్ క్రికెటర్‌తో డేటింగ్ చేస్తోందని కథనాలు మొదలయ్యాయి.

## ఏడాదిగా రూమర్స్..

శ్రీలీల, తిలక్ వర్మ ప్రేమలో ఉన్నారని గతేడాది నుంచి సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇటీవల వీరిద్దరూ కలిసి కనిపించారని వార్తలు రావడంతో రూమర్స్‌కు మరింత బలం చేకూరుతోంది. దాదాపు ఆరు నెలల క్రితమే శ్రీలీల తన తల్లితో కలిసి తిరుమలను సందర్శించింది. అదే సమయంలో తిలక్ వర్మ కూడా అక్కడే ఉన్నట్లు సమాచారం.ఆ తర్వాత ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా శ్రీలీల, ఆమె తల్లితో పాటు ముంబయి ఇండియన్స్ ఆటగాళ్లతో కలిసి కనిపించడంతో రూమర్స్ మరింత బలపడుతున్నాయి. అయితే తమపై వస్తున్న వార్తలపై ఇప్పటి వరకు ఎవరు కూడా స్పందించలేదు.








EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com